ఈనాడు కాకినాడ

నవంబరు 15న సత్యదేవుని గిరిప్రదక్షిణ

గత సమస్యలు పునరావృతం కాకుండా ప్రణాళిక

అన్నవరం, న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి రోజు నిర్వహించే అన్నవరం సత్యదేవుని గిరి ప్రదక్షిణకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆ రోజున రత్న, సత్యగిరుల చుట్టూ సుమారు 8.4 కి.మీ మేర సాగే ప్రదక్షిణకు దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారు. దర్శనం, వ్రతాలకు తీవ్ర రద్దీ నెలకొంటుంది. ఈ ఏడాది నవంబరు 15న గిరి ప్రదక్షిణ ఉండనుంది. ఏటా ఉదయం 8 గంటలకు కొండ దిగువన తొలిపావంచాల వద్ద సత్యరథానికి పూజలు చేసి ప్రదక్షిణ ప్రారంభిస్తుంటారు. ఇదే సమయానికి భక్తులు వేలాదిగా పాల్గొంటుండటంతో నియంత్రణ, సౌకర్యాల విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో ఈసారి మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథాన్ని ప్రారంభిస్తారు. వైదిక కార్యక్రమాలన్నీ తొలుత నిర్వహించి ఆ తర్వాత రథాన్ని ప్రారంభిస్తే ఉదయం నుంచే భక్తులు గిరిప్రదక్షిణలో ఉంటారని.. తద్వారా కొండ దిగువన, పైన ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. సింహాచలంలో ప్రస్తుతం ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. అక్కడ కొండ దిగువన తొలిపావంచాల వద్ద మధ్యాహ్నం 2 గంటలకు అప్పన్న పుష్పరథాన్ని ప్రారంభిస్తారు. భక్తులు ఉదయం నుంచే గిరిప్రదక్షిణ చేస్తుంటారు.



గత ఏడాది నవంబరు 27న సత్యదేవుని దర్శనానికి కిక్కిరిసిన భక్తులు (కొండపైన)

● నాడు తీవ్ర అవస్థలు

అన్నవరంలో గతేడాది నవంబరు 27న గిరి ప్రదక్షిణ నిర్వహించగా రెండు లక్షల మంది హాజరయ్యారు. ఇదే సమయంలో దర్శనానికి సుమారు 1.50 లక్షల మంది రావడం. . వ్రతాలు కూడా 16వేల వరకు జరగడంతో కొండపైన ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేయలేక ఇబ్బందులు ఎదురయ్యాయి. గత అనుభవాలు, ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఈ దఫా సమస్యలకు ఆస్కారం లేకుండా చేయాలని యోచిస్తున్నారు. ఈవో కె.రామచంద్రమోహన్ మాట్లాడుతూ "కార్తిక పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ, సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు కొండపైన, దిగువన ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సత్యరథాన్ని మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించాలని భావిస్తున్నాం. దీంతో భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేయడానికి వీలుంటుంద'ని తెలిపారు.

టెట్ పరీక్షకు 1,150 మంది హాజరు

సాంబమూర్తినగర్(కాకినాడ): జిల్లాలో మంగళవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 1,150 మంది హాజరయ్యారు. నాలుగు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,334 మంది హాజరు కావాలి. ఉదయం పరీక్షలో 564 మంది, మధ్యాహ్నం పరీక్షలో 586 మంది హాజరయ్యారు. 184 మంది గైర్హాజరు అయినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు.

గండాల దారి.. గుంతల్లో సవారీ




సామర్లకోట రైల్వే వంతెన వద్ద రహదారి దుస్థితి



కాకినాడ-సామర్లకోట మార్గంలో మాధవపట్నం-కాకినాడ బైపాస్ రైల్వే వంతెన వద్ద ఇలా..

గత వైకాపా ప్రభుత్వం రహదారుల నిర్వహణ, మరమ్మతులు పూర్తిగా విస్మరించింది. ప్రధాన మార్గాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి. కాకినాడ-సామర్లకోట రహదారే ఇందుకు నిదర్శనం. 15 కి.మీ. ఈ మార్గం పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన నగరాలైన రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలను కలిపే మార్గాల్లో ఇది ఒకటి. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి లోతు తెలియక ప్రయాణం నరకంగా మారింది. ఇటీవల 60 ఏళ్లు దాటిన వృద్ధ దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తూ మాధవపట్నం కాకినాడ బైపాస్ రైల్వే వంతెన దాటిన తర్వాత గుంతలో పడ్డారు. వృద్ధురాలు కిందపడి మృత్యువాత పడ్డారు. యంత్రాంగం స్పందించి ఈ రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. **- ఈనాడు, కాకినాడ**

బ్రాండ్ బాజా



నేటి నుంచి కొత్త మద్యం దుకాణాలు
లైసెన్సుల జారీతో అమ్మకాలకు ఏర్పాట్లు


ఈనాడు, కాకినాడ: మద్యం దుకాణాల కేటాయింపులో కీలక ఘట్టం ముగియడంతో దుకాణాల ఏర్పాటులో ప్రైవేటు వ్యాపారులు హడావిడిగా ఉన్నారు. వైకాపా హయాంలో ప్రభుత్వమే ఈ దుకాణాలు నడిపేది. నాసిరకం బ్రాండ్లు అందుబాటులోకి తేవడంతో ఆరోగ్యాలు దెబ్బతిన్నాయని వేలాదిమంది ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాత ప్రక్రియను రద్దుచేసి కొత్త మద్యం విధానం తెరమీదికి తెచ్చింది. నికార్సయిన బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టింది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో 413 దుకాణాలు మంజూరుచేసింది. సోమవారం నిర్వహించిన లాటరీలో వీటిని దక్కించుకున్నవారు అబ్కారీ శాఖ నుంచి ప్రొవిజనల్ లైసెన్సులు పొంది.. బుధవారం నుంచి దుకాణాలు తెరవబోతున్నారు.

నాటు సారా సెగ

ఉమ్మడి జిల్లాలో 32 మండలాల పరిధిలోని 120 గ్రామాల్లో నాటుసారా తయారీ విచ్చలవిడిగా సాగుతున్నట్లు గతంలో అబ్కారీ శాఖ అంచనా వేసింది. ఏటా సారా వ్యాపారం రూ.150 కోట్లకుపైనే. వైకాపా ప్రభుత్వ హయాంలో సెబ్ పేరుతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినా ఫలితం లేకపోయింది. మద్యం దుకాణాల ద్వారా వచ్చే ఆదాయానికి నాటుసారా గండికొట్టే ప్రమాదం ఉందన్న ఆందోళన దుకాణదారుల్లో నెలకొంది. నిబంధనల మేరకు మద్యం దుకాణాలు నడిచేలా చూడడంతోపాటు.. నాటుసారాపై ఉక్కుపాదం మోపుతామని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డీసీ చైతన్యమురళి తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచుతామన్నారు.

చకచకా ఏర్పాట్లు

మద్యం దుకాణదారులు ప్రాథమికంగా లైసెన్సు రుసుములో 1/6 వంతు మొత్తాన్ని చెల్లించి, మిగిలిన మొత్తానికి బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంది. వారికి ప్రొవిజనల్ లైసెన్సు ఇస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి ఉమ్మడి జిల్లాలో 373 దుకాణాలకు లైసెన్సులు మంజూరుచేశారు. రాత్రికి నూరుశాతం పూర్తిచేసి బుధవారం నుంచి వ్యాపారాలకు వెసులుబాటు కల్పిస్తున్నారు. ● కాకినాడ జిల్లాలోని మద్యం దుకాణాలకు సామర్లకోట డిపో.. కోనసీమలోని దుకాణాలకు అమలాపురంలోని డిపో నుంచి మద్యం నిల్వలు సరఫరా అవుతాయి. తూర్పుగోదావరిలోని రాజమహేంద్రవరం పరిధిలో దుకాణాలకు రాజమహేంద్రవరం డిపో నుంచి.. నిడదవోలు, దేవరపల్లి, కొవ్వూరు పరిధిలోని దుకాణాలకు చాగల్లు డిపో నుంచి సరఫరా చేస్తారు. లైసెన్సుదారుకు కేటాయించిన ఐడీ ఆధారంగా ఏ బ్రాండ్లు కావాలో డిపోల నుంచి కొనుక్కునే వెసులుబాటు కల్పించారు. ● ఒక్కసారిగా డిమాండ్ ఆధారంగా దుకాణాల కొరత, అద్దెల దరువు వ్యాపారులకు ఇబ్బందిగా మారింది. విద్యాలయాలు, గుర్తింపు పొందిన దేవాలయాలు/ మసీదు/ చర్చిల ఆవరణలో దుకాణాలు ఉండకూడదని అబ్కారీ శాఖ స్పష్టం చేసింది. దీంతో ఇటువంటి లోపాలకు ఆస్కారం ఇవ్వకుండా పరిశీలిస్తున్నారు.



భారీ వర్షాలపై అప్రమత్తత

కాకినాడ కలెక్టరేట్: అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్, డివిజన్, మండలస్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. తీర ప్రాంత మండలాల్లో అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. మండలాల ప్రత్యేక అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్‌శాఖలు సిద్ధంగా ఉండాలన్నారు. *కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసేలా 18004253077 టోల్‌ఫ్రీ నంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.* ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఓటు నమోదు

కాకినాడ కలెక్టరేట్: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మంగళవారంతో గడువు ముగిసింది. సెప్టెంబరు 3 వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. విచారణ పూర్తి చేసి, 24న ముసాయిదా జాబితా ప్రచురించారు. అభ్యంతరాల స్వీకరణతో పాటు ఈనెల 15 వరకు మిగిలిపోయిన అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటివరకు వచ్చినవాటిపై ఈనెల 30లోగా విచారణ చేసి, నవంబరు 6న తుది జాబితా ప్రకటిస్తారు. గతనెల 24 నుంచి ఈనెల 15 వరకు కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి జిల్లాల్లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల వివరాలు మంగళవారం రాత్రికి కాకినాడ కలెక్టరేట్‌కు చేరలేదు. బుధవారం కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

జిల్లాకో సారథి.. అభివృద్ధికి వారధి

ఈనాడు, కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరిలోని మూడు జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. ఆయా జిల్లాల్లో అమలయ్యే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి, పర్యవేక్షించే బాధ్యత అప్పగించింది. కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జిగా పురపాలక- పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణను నియమించారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ఇన్‌ఛార్జిగా వ్యవసాయ- సహకార- మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.. తూర్పుగోదావరి జిల్లాకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును నియమించారు.



పొంగూరు నారాయణ



కింజరాపు అచ్చెన్నాయుడు



డాక్టర్ నిమ్మల రామానాయుడు

- కాకినాడ ఇన్‌ఛార్జిగా నారాయణ
- అంబేడ్కర్ కోనసీమకు అచ్చెన్నాయుడు
- తూర్పునకు రామానాయుడు

గత వైకాపా పాలనలో వ్యవస్థలు గతితప్పాయి.. అనేక కీలక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. వీటిని గాడినపెట్టే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. పాలన కదులుతున్న ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. వ్యవసాయ ఆధారిత జిల్లాలు కావడం.. రెండు నగరాలు, కీలక పట్టణాలు ఉండడంతో మంత్రుల పర్యవేక్షణలో పరిస్థితి చక్కదిద్ది, ప్రగతిని పట్టాలెక్కిస్తారనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ❖ డెల్టాలకు ఆధారమైన కాటన్ బ్యారేజీని బలోపేతం చేసి ఆ పరిధిలోని సాగునీటి, మురుగు పారుదల వ్యవస్థలను ఆధునికీక

ఆశలన్నీ అమాత్యులపైనే..

రించాలి. ఈ ప్రక్రియ సమగ్రంగా పూర్తయితే ముంపు సమస్యకు, శాశ్వత సాగునీటి కష్టాలకు పరిష్కారం దొరికినట్టే. ❖ ఉమ్మడి జిల్లాతోపాటు విశాఖ అవసరాలు తీర్చేందుకు నిర్దేశించిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ కొలిక్కి వస్తే సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు నీళ్లు అందుబాటులోకి వస్తాయి. ❖ ఏటా విపత్తులు, వరదలతో ఎదురయ్యే నష్టాన్ని తగ్గించే దిశగా చర్యలకు ఉపక్రమించాలి. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో కోత నివారణ చర్యలు అవసరం. ❖ ధాన్యాగారంగా పేరున్నప్పటికీ రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. స్థానికంగా ఉన్న ఇబ్బందులతో రైతులు.. విత్తులతో ఏటా నష్టపోతున్నారు. వారికి ఊతమివ్వాలి. ధాన్యం కొనుగోలులో దళారీల జోక్యం కట్టడి చేసి, మద్దతు ధర సమగ్రంగా అందించాలి. ❖ కాకినాడ ఆకర్షణీయ నగరం పనులు గత ప్రభుత్వ నిర్వాకంతో గతితప్పాయి. గాడిన పెట్టాలి. విలీన గ్రామాల సమస్యకు పరిష్కారం చూపాలి. నగర పాలక సంస్థ ఎన్నికలకు చొరవచూపాల్సి ఉంది.

సమన్వయంతో అభివృద్ధికి కృషి

వ్యవసాయ ఆధారిత అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌ఛార్జిగా బాధ్యత చేపట్టడం ఆనందంగా ఉంది. వ్యవసాయం, ఉద్యానవన, మత్స్యకారుల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తాను. సహకార రంగం బలోపేతంపైనా దృష్టిసారిస్తా. జనసేన- భాజపా- తెదేపా శ్రేణుల సమన్వయంతో జిల్లాలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతాం. సంక్షేమ కార్యక్రమాల అమలు సమర్థంగా జరిగేలా చూస్తాం.

-కింజరాపు అచ్చెన్నాయుడు, వ్యవసాయ-సహకార-మత్స్యశాఖ మంత్రి

నీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

నేటి నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. డైరెక్టరు, అధ్యక్షుడి ఎన్నికకు సంబంధిత ఆయకట్టు పరిధిలోని రైతులతో బుధవారం నుంచి ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ఉండనుంది. ప్రస్తుతం డెల్టా పరిధిలో 49, ఏలేరు ప్రాజెక్టు పరిధిలో 25, పీబీసీలో 14, మధ్యతరహా ప్రాజెక్టుల పరిధి 10, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 113 నీటి సంఘాలకు ఎన్నికలు ఉంటాయి. ఇప్పటికే జిల్లా యంత్రాంగం దీనిపై చర్యలు చేపట్టింది. ఒక్కో సంఘం పరిధిలోని ఆయకట్టు, వాటికి సంబంధించిన రైతుల జాబితా ఒక్కో విధంగా ఉంది. వీటన్నింటినీ ఒకేతరహాలో సరిచేయడం ద్వారా ప్రస్తుతం ఉన్న సంఘాలు మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

విధానం మార్చాలని..

ఏలేరు ప్రాజెక్టు పరిధిలో ప్రస్తుతం 25 నీటి సంఘాలు, ఆరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉంది. ఇక్కడ ఒకచోట 2500 ఎకరాల నుంచి 3వేల ఎకరాల పరిధిలో ఒక నీటి సంఘం కొనసాగుతుండగా మరోచోట 1400 ఎకరాల పరిధిలోనే సంఘాలు ఉన్నాయి. ఈ విధానాన్ని మార్చాలని రైతు నాయకులు కోరుతున్నారు. తద్వారా మరో నాలుగు సంఘాలు పెరుగుతాయి. మెట్ట ప్రాంతంలో ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో ఉన్న రైతులు కలిసి నీటిసంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల ద్వారా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. ఈనెల 16 నుంచి నవంబరు 12 లోగా మార్పులు, చేర్పులతో ఓటర్ల జాబితా పూర్తిచేయాలని నిర్ణయించారు. దీనిని జలవనరులశాఖ కాడాకు పంపించి తుది అనుమతి తీసుకుని నవంబరు 15న నోటిఫికేషన్ విడుదల చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

దొంగ చేతికే తాళాలా..!

డీఆర్‌డీఏ క్షేత్రస్థాయి సిబ్బంది తనిఖీలపై అనుమానాలు

▌ కాకినాడ గ్రామీణ మండలంలోని ఓ బ్యాంకులో డ్వాక్రా సంఘాలు రుణం తీసుకున్నాయి. వాటిని తీర్చకుండానే నిబంధనలకు విరుద్ధంగా కరపలోని మరో బ్యాంకులో ఈ సంఘాలు రుణాలు తీసుకున్నాయి. దీంతో 10మంది యానిమేటర్లను విధుల నుంచి తొలగించారు. బ్యాంకు అధికారులపై చర్యలు లేవు.

▌ కాకినాడ గ్రామీణ పరిధి తిమ్మాపురంలోని ఓ బ్యాంకులో సుమారు 100 డ్వాక్రా సంఘాలు రుణాలు పొందాయి. అక్కడ అప్పు తీర్చకుండానే సర్పవరం, పెనుమర్తి గ్రామాల్లోని వేరే బ్యాంకుల్లో రుణాలు పొందారు.

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: బోగస్ డ్వాక్రా సంఘాలు సృష్టించారు.. పొదుపు ఆపేసి, అప్పులు చెల్లించకుండా ఎగ్గొట్టిన సంఘాలను లక్ష్యంగా చేసుకున్నారు.. పిఠాపురం నియోజకవర్గంలో కొంతమంది డీఆర్‌డీఏ సిబ్బంది, వైకాపా నేతలు, బ్యాంకర్లు కుమ్మక్కై సుమారు రూ.16కోట్ల మేర బ్యాంకు లింకేజీ రుణాలు పొందారు. దీనిపై సెర్ప్ సీఈవో వీరపాండ్యన్ విచారణకు ఆదేశించారు. సెర్ప్ వద్ద ఉన్న జాబితా, బ్యాంకుల వద్ద వివరాలతో పోల్చి, అక్రమాలు నిగ్గుతేల్చాలని హుకుం జారీ చేశారు. విచారణ బాధ్యతలను డీఆర్‌డీఏకు చెందిన క్షేత్రస్థాయి సిబ్బంది యానిమేటర్లు, సీసీలు, ఏపీఎంలకు అప్పగించారు. 20 రోజులు గడిచినా నివేదికలు డీఆర్‌డీఏ కార్యాలయానికి చేరలేదు. జిల్లాలో బ్యాంకు లింకేజీ రుణాలపై విచారణ జరుగుతోంది. అవకతవకలకు పాల్పడిన సిబ్బందితోనే ప్రక్రియ చేపట్టడంపై విమర్శలు ఎదురవుతున్నాయి. సభ్యుల ఆధార్ కూడా పరిశీలించకుండా, కొందరు యానిమేటర్లు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లతో బ్యాంకర్లు కలిసి రుణాలు ఇస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద డ్వాక్రా మహిళల నిరసన

విచారణలో కొన్ని వాస్తవాలు..

కరప మండలంలో 1,796 డ్వాక్రా సంఘాలున్నాయి. అందులో 47 సంఘాల రద్దుకు సిఫార్సు చేశారు. వేరే సంఘంలో ఉన్నవారు, వలస వెళ్లినవారు, పొదుపు కట్టని, అప్పు చెల్లించనివిగా వీటిని గుర్తించారు. ఈ ఖాతాలు మూసేయాలి. ✦ కాజులూరు మండలంలో 1,773 సంఘాలుండగా 15 సంఘాల రద్దుకు సిఫార్సు చేశారు. ✦ జిల్లాలో 39,532 డ్వాక్రా సంఘాలు ఉండగా, 4,08,410 మంది సభ్యులున్నారు. వీరిలో అర్హత ఉన్న 80 శాతం మందికే ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తున్నారు. దీని ఆసరాగా ఇతర ప్రాంతాల వారితో బోగస్ సంఘాలు సృష్టించి, డీఆర్‌డీఏ క్షేత్రస్థాయి సిబ్బంది రుణాలు ఇప్పిస్తున్నారు.

డిక్లరేషన్ తీసుకుంటున్నాం..

యానిమేటర్లు, సీసీలు, ఏపీఎంలతో దస్త్రాలు తనిఖీ చేయిస్తున్నాం. నివేదికను జిల్లాస్థాయిలో మరోసారి పరిశీలిస్తున్నాం. ఇంకా క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి పూర్తిస్థాయి నివేదికలు రావాలి. వీరిచ్చే నివేదికలు తప్పుగా ఉంటే వారినే బాధ్యులు చేస్తాం. వీరి నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నాం.

– కె.శ్రీరమణి, పీడీ(ఎఫ్ఏసీ), డీఆర్‌డీఏ, కాకినాడ

కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి రేపు

కాకినాడ కలెక్టరేట్: ఈనెల 17 మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండగ్గా నిర్వహిస్తోందని కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో వాల్మీకి జయంతిని నిర్వహించనున్నామని, అందరూ పాల్గొనాలని కోరారు.

కాకినాడ ఆర్టీవోగా శివారెడ్డి

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ ప్రాంతీయ రవాణా(ఆర్టీవో) అధికారిగా శివారెడ్డి నియమితులయ్యారు. ఈయన నంద్యాల నుంచి ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన సాయిప్రసాద్ మూడునెలల క్రితం పదవీ విరమణ చేశారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ ఇప్పటివరకు ఆ స్థానంలో విధులు నిర్వహించారు. కాకినాడ రవాణా శాఖ పరిధిలోని పలువురు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఏవోలు, ఇతర సిబ్బందికి బదిలీలు అయ్యాయి.

తాండవలో 377 అడుగుల నీటి మట్టం



తాండవ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 377.6 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు ప్రాజెక్టు డీఈ పి.అనురాధ 'న్యూస్‌టుడే'కు మంగళవారం తెలిపారు. అడపాదడపా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు పడుతుండటంతో ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటి సామర్థ్యం 380 అడుగులు కాగా, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఇంకా వర్షాలు పడే అవకాశం ఉండటంతో ముందుజాగ్రత్తగా కాలువల ద్వారా రమారమి 555 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. **– న్యూస్‌టుడే, తుని**

నిత్యావసరాలకు 18 ప్రత్యేక కౌంటర్లు

కాకినాడ కలెక్టరేట్: నిత్యావసర సరకుల ధరల నియంత్రణలో భాగంగా జిల్లాలో 18 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ తెలిపారు. కాకినాడ, పెద్దాపురం రైతుబజార్లలో నాలుగు, తుని, ఏలేశ్వరం, కత్తిపూడి, పెద్దాపురం, కాకినాడ, పిఠాపురంలోని వివిధ ప్రైవేటు మార్టుల్లో 14 చొప్పున కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా రేషన్‌కార్డుకు లీటరు రూ.110 చొప్పున మూడు లీటర్ల పామాయిల్, లీటరు రూ.124 చొప్పున సన్‌ఫ్లవర్ వంటనూనె విక్రయిస్తారని తెలిపారు. కిలో ఉల్లిపాయలు రూ.46, రూ.40, టమాటా కిలో రూ.40 చొప్పున విక్రయిస్తారన్నారు. అవసరమైతే మరిన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. టోకు వ్యాపారులు, మార్టుల ప్రతినిధులతో సంప్రదింపులు చేస్తున్నామని, నిర్దేశిత ధరలు ఈనెల 24 వరకు అమల్లో ఉంటాయన్నారు.

లారీ యజమానుల సంఘం తీరుపై నిరసన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలోని కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ పాలకవర్గంతో తీవ్రంగా నష్టపోయామని, ఇప్పుడు కొత్త పాలకవర్గం వచ్చినా తీరుమారలేదని అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. లారీ యజమానుల తరపున గూడవల్లి మృత్యుంజయరావు, బి.సత్తిబాబు, కడియాల అంజిబాబు మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన దోపిడీని అడ్డుకోడానికి ప్రజాస్వామ్యబద్ధంగా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలని కోరినా, ఏకపక్షంగా కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పాలకవర్గం లారీ యజమానులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని, వారికున్న వాహనాలకు సీరియల్ ఇప్పించుకుని, దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కొన్నిరోజులుగా బెదిరిస్తున్నారని, న్యాయబద్ధంగా సీరియల్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెడుతున్నారని అన్నారు. అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి, ఎన్నికలు జరపాలని కోరుతున్నామన్నారు. ప్రత్యామ్నాయం చూసుకుంటామన్నారు. కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఆ నియోజకవర్గం పరిధిలో లారీ ఓనర్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకుంటున్నట్లు ప్రకటించారు.



కలెక్టరేట్ వద్ద అసోసియేషన్ సభ్యుల ఆందోళన

శిశుగృహలో పోస్టులకు ముఖాముఖి

కాకినాడ కలెక్టరేట్: కాకినాడలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహలో మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఖాళీగా ఉన్న సోషల్‌వర్కర్-1, రెండు ఆయా పోస్టులకు మంగళవారం కలెక్టరేట్‌లో ముఖాముఖి నిర్వహించారు. జేసీ రాహుల్‌మీనా అధ్యక్షతన జరిగింది. సోషల్‌వర్కర్ పోస్టుకు 13 మంది దరఖాస్తు చేయగా 12 మంది, ఆయా పోస్టులకు 11 మంది దరఖాస్తు చేయగా 8 మంది హాజరయ్యారు. కమిటీ సభ్యులు ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ పి.సూర్యప్రభావతి, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులు సీహెచ్.తబితా, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్.వెంకటరావు పాల్గొన్నారు.

ప్రతి మండలంలో 'వెలుగు మహిళా మార్ట్'

కాకినాడ కలెక్టరేట్: డ్వాక్రా సభ్యులతో మండలానికి ఒక వెలుగు మహిళా మార్టు ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ(ఎఫ్ఏసీ) కె.శ్రీరమణి తెలిపారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలోని జిల్లా మహిళా సమాఖ్య, వెలుగు మహిళా మార్టుల కమిటీ ప్రతినిధులు, డీపీఎంలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పాడ, ఏ.కొత్తపల్లి, తాళ్లరేవు, కిర్లంపూడిలో మహిళా మార్టులు ఉన్నాయని, వీటి పేరును వెలుగు మహిళా మార్టులుగా మార్చారన్నారు. డ్వాక్రా సభ్యులే వీటిని నిర్వహిస్తారని, వచ్చే లాభాలను సంఘాలు వినియోగించుకుంటాయన్నారు. వీటిని ఆదరించాలన్నారు. ఎన్నికల కోడ్‌తో లావాదేవీలు తగ్గాయని, మళ్లీ పుంజుకోడానికి కృషి చేయాలన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు వీబీఆర్ రాయ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, ఏపీఎంలు, మార్టుల కొత్త పాలకవర్గం ప్రతినిధులతో శిక్షణ ఇచ్చారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఐ.కల్పన, డీపీఎంలు బి.వెంకటేశ్వరరావు, టి.అశోక్‌భరత్, టి.బాబూరావు, ఎం.ఎం.జిలానీ పాల్గొన్నారు.



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డీపీఎం రాయ్

రాయితీపై సౌరశక్తి పలకలు

కాకినాడ కలెక్టరేట్: సౌరశక్తి వినియోగం పెంచడానికి కేంద్రం ప్రోత్సాహకాలు అందిస్తోందని, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇళ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు రాయితీ ఇస్తున్నారని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పథకం అమలు, దరఖాస్తులపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుతో విద్యుత్తు బిల్లు ఆదా చేసుకోవచ్చన్నారు. ఇంటిపై 100 చ.అ.ల విస్తీర్ణంలో కిలోవాట్ సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తారన్నారు. జిల్లాలో 1,027 మంది నమోదు చేసుకున్నారని, 421 మంది దరఖాస్తు రుసుం చెల్లించారని వివరించారు. పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, విద్యుత్తుశాఖ ఈఈలు ఎ.ప్రభాకర్, బి.వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, అధికారులు

27 నుంచి సత్య దీక్షలు ప్రారంభం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామి దీక్ష ఈ నెల 27 నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 27 నుంచి నవంబరు 23 వరకు 27 రోజుల దీక్ష, నవంబరు 6 నుంచి 18 రోజుల దీక్ష, నవంబరు 14 నుంచి 9 రోజుల దీక్షను భక్తులు చేపట్టను న్నారు. భక్తులకు దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గిరిజన గ్రామాల్లోని భక్తులకు దేవస్థానం నుంచి దీక్షా వస్త్రాలు ఉచితంగా అందజేస్తున్నారు. అడ్డతీగల పసరవ ప్రాంతాల్లో భక్తులకు అందించేందుకు పవనగిరి స్వామీజీకి దీక్షా వస్త్రాలు, నియమావళి పుస్తకాలను సూపరింటెండెంట్ బలువు వాసు అందజేశారు.



దీక్షా వస్త్రాలు అందజేస్తున్న ఆలయాధికారి

ఉత్సాహంగా ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలు

మసీదుసెంటర్ (కాకినాడ): ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలు క్రీడల్లో ఎంపికలు నిర్వహించినట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.కె. జార్జి మంగళవారం తెలిపారు. వాలీబాల్ అండర్-17 బాలురు, సాఫ్ట్ టెన్నిస్ అండర్-14, 17 బాలబాలికలకు, మార్షల్ ఆర్ట్స్ అండర్-14, 17 బాలబాలికల ఎంపికలు జరిగాయన్నారు. సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. కాకినాడ జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వి.రవిరాజు, సూరకరాజు, కోశాధికారి రవి సుందర్ కౌర్, ఎస్జీఎఫ్ అసిస్టెంట్ కార్యదర్శులు సునీల్, కె.పరశురాం, పీడీలు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పాదగయలో పొట్టేల్ సినీ బృందం పూజలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని పొట్టేల్ సినిమా యూనిట్ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఆలయంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవి, పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామివార్లను సినీ హీరో యువ, హీరోయిన్ అనన్య నాగళ్ల, నటుడు నోయల్, నిర్మాత నిషాంక్ దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు క్షేత్ర విశిష్టతను వివరించారు. ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయానికి వచ్చిన చిత్ర బృందాన్ని చూసేందుకు జనం రావడంతో ఆలయం కిక్కిరిసింది. యువ, అనన్య మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో చిత్రం ప్రచార కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.



పాదగయ విశిష్టతను తెలుసుకుంటున్న సినీ నటులు యువ, అనన్య తదితరులు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తదితరులు

పట్టభద్రుల ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

కూటమి నేతలు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: త్వరలో జరగబోయే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కూటమి నాయకులంతా కృషిచేద్దామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం మంగళవారం రాజమహేంద్రవరంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలో లేనప్పుడే పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టగానే మెగా డీఎస్సీ ప్రకటించిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందు.. నమోదు ప్రక్రియకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

వైకాపా యువతను మోసం చేసింది..

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అంతా కలిసి కట్టుగా పనిచేస్తే వైకాపా పోటీకి వచ్చే అవకాశం లేదన్నారు. అభ్యర్థి ఎవరైనా కూటమి గెలుపుకోసం పని చేయాలన్నారు. రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పాలన అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం యువతను నమ్మించి మోసం చేసిందన్నారు. కాకినాడ, ఏలూరు, రాజమహేంద్రవరంలో ఎక్కువ మంది పట్టభద్ర ఓటర్లుంటారు కనుక మరింత దృష్టి సారించాల్సి ఉందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీలు హరిప్రసాద్, చిరంజీవరావు, మాజీ మంత్రులు సుజయ్ కృష్ణ రంగారావు, జవహర్, పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, భాజపా జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథ్ తదితరులు మాట్లాడారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ, బూరుగుపల్లి శేషారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కూటమి నేతలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో.. అసౌకర్యాలు.. చోరీలు..

గొప్పలు..

వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలోనే తొలిసారిగా నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో జగనన్నకాలనీ ప్రారంభమైంది. కాలనీల్లో ఇళ్లు కాదు. . ఊళ్లు నిర్మిస్తామని గొప్పలు ఇక్కడి నుంచే ఆరంభించారు. సౌకర్యాలు సమకూరుతాయని, అద్దె భారం తప్పుతుందని చాలామంది కాకినాడ నుంచి వచ్చి ఇక్కడ ఇళ్లు కట్టుకుని ఉంటున్నారు.

తిప్పలు..

స్థలాలిచ్చారని లబ్ధిదారులు ఇళ్లు కట్టుకున్నారు. గత పాలకులు మౌలిక వసతుల గురించి మరిచి పోవడంతో కాలనీలో ఉండలేక తిరిగి వచ్చినచోటకే వెళ్లిపోతున్నారు. దారుల్లో బురద, అసౌకర్యంగా విద్యుత్తు, తాగు నీటి వెతలు భరించలేకున్నామంటున్నారు.

- న్యూస్‌టుడే, కొత్తపల్లి

భయాలు..

ఈ కాలనీలో ఇటీవల చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువయ్యాయి. కొమరగిరి లేఅవుట్‌లో 60 కుటుంబాలు ఉంటున్నాయి. మరో 100 కుటుంబాలు ఇక్కడి పరిస్థితులకు భయపడి ఇళ్లకు తాళాలేసి కాకినాడకు వెళ్లిపోయాయి. విద్యుత్తు మోటార్లు, సామగ్రి, వాహనాల టైర్లు తదితరాలను ఎత్తుకుపోతున్నారని వాపోతున్నారు. ఇటీవల వారం రోజుల్లో పదిళ్లలో చోరీలు జరిగాయి. నిర్మాణ దశలోని ఇళ్లు మద్యం తాగే, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారికి నిలయాలుగా మారాయి. గంజాయి మత్తులో తిరుగుతున్న యువకులను ఇదేంటని ప్రశ్నిస్తే.. దాడులకు తెగబడుతున్నారని, బీచ్‌రోడ్డు అనుకుని ఉండడంతో మందుబాబుల ఆగడాలు భరించలేకున్నామని, అత్యవసరంలోనూ రాత్రివేళ బయటకు రాలేకున్నామని నివాసితులు భయాందోళన చెందుతున్నారు.



కొమరగిరిలో జగనన్న కాలనీ

పింఛను.. రేషనూ కాకినాడలోనే..

కాలనీలో ఉంటున్నా.. పథకాలకు కాకినాడకు పరుగు పెట్టాల్సివస్తోందని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. స్థానికంగానే అన్ని పథకాలు అందిస్తామని గత పాలకులు చెప్పినా.. అమలు చేయలేదని, కూటమి ప్రభుత్వం తమ కష్టాలు తొలగించాలని నివాసితులు కోరుతున్నారు.

రక్షణ కల్పించండి

ప్రభుత్వం స్థలం ఇచ్చిందని ఇల్లు కట్టుకున్నాం. ఇక్కడ రక్షణ లేదు. రాత్రివేళల్లో చెప్పుకోలేని ఘటనలు జరుగుతున్నాయి. మద్యం తాగిన వారు కొందరు ఇళ్లచుట్టూ కేకలు వేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారు. పోలీసు అధికారులు నిఘా ఉంచి, ఆగడాలు అరికట్టాలి.



- బత్తుల అనంత, కాలనీవాసి

వసతులు.. రక్షణ కల్పిస్తాం

కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తాం. తాగునీరు, విద్యుత్తు తదితర మౌలిక వసతులు కల్పిస్తాం. చోరీలు, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు ఉన్నతాధికారులకు తెలిపి రక్షణ కల్పిస్తాం.

- ఎన్‌వీవీ సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ పీడీ

అక్రమ మద్యం గుట్టు వీడేనా..?

రాపాకలో సీసాలు స్వాధీనం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తుని మండల పరిధిలో అక్రమ మద్యం వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుంది. ఈ మేరకు పోలీసులు గత వారం రోజులుగా ప్రత్యేక తనిఖీలు చేపట్టి పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడం విదితమే. ఈ మాఫియా వెనుక ఉన్న నాయకులను గుర్తించడంపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. గత వారం రోజుల్లో తుని రూరల్ ఎస్.అన్నవరం పరిధిలోని 128 మద్యం కేసులను స్వాధీనం చేసుకోవడంతోపాటు మరుసటి రోజు కేవో మల్లవరం గ్రామంలో మరో 166 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే క్రమంలో సుమారు 84 మద్యం క్వార్టర్ బాటిల్స్‌ను మంగళవారం రాపాక గ్రామంలో స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై కృష్ణామాచారి తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్సై రత్నం, సిబ్బంది పాల్గొన్నారు. మద్యం మాఫియా వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తుని రూరల్ సీఐ చెన్నాకేశవరావు తెలిపారు. త్వరలో వివరాలు వెల్లడిస్తామన్నారు.

నాయీబ్రాహ్మణులకు రూ.800 కోట్లు కేటాయించాలి

కాకినాడ కలెక్టరేట్: ఉమ్మడి జిల్లాలోని నాయీబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు మంగళవారం కాకినాడలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారికి అవసరమైన నిధులు, సదుపాయాలు, అవకాశాలపై చర్చించారు. ఆ సంఘాల ప్రతినిధులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి రూ.800కోట్లు కేటాయించాలని కోరారు. గ్రేడ్-1 దేవాలయాలకు ఛైర్మన్లుగా, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు, పట్టణ స్థానిక సంస్థల్లో కో-ఆప్షన్ సభ్యులుగా నియమించాలని కోరారు. స్వయం ప్రతిపత్తి ఉన్న దేవాలయాల్లో డైరెక్టర్ పదవులు ఇవ్వాలని, వాయిద్య కళాకారులకు 50 ఏళ్లకే పింఛను సదుపాయం కల్పించాలని కోరారు. సంఘాల ప్రతినిధులు సుందరపల్లి గోపాలకృష్ణ, దాస్యం ప్రసాద్, చొప్పెల్ల శ్రీనివాస్, మానుకొండ దుర్గాప్రసాద్, ఎం.నాగసత్యనారాయణ, కె.సూరిబాబు, ర్యాలి లోవరాజు, సీహెచ్.శివప్రసాద్, వేపాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఈడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యల పరిష్కారానికి వినతి


సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: ఉపాధ్యాయుల పీఎఫ్ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) జిల్లా పరిషత్తు సీఈవోకు విన్నవించింది. మంగళవారం జడ్పీ కార్యాలయంలో సీఈవో వీవీఎస్ లక్ష్మణరావును ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్ తదితరులు కలిశారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి పీఎఫ్ స్లిప్పులను అందుబాటులో ఉంచాలని కోరారు. 2022 జనవరి, ఫిబ్రవరిల పీఎఫ్ సబ్‌స్క్రిప్షన్లను వారి ఖాతాలో నమోదు చేయాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుల పీఎఫ్ చెల్లించిన తర్వాత జమైన 2022 జనవరి, ఫిబ్రవరిల పీఎఫ్, డీఏల బకాయిలు తిరిగి చెల్లించాలన్నారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సీఈవోకు ఇచ్చారు. నాయకులు యు.శ్రీను, పి.సుబ్బరాజు, టి.సంపత్‌కుమార్, పోతు రామకృష్ణ, కేవీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



సీఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందించిన ఎస్టీయూ నాయకులు

సీఎం సహాయ నిధికి రూ.10.26 లక్షలు

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: విజయవాడ వరదల్లో తీవ్రంగా నష్టపోయిన బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రూ.10.26 లక్షలు అందజేశారు. విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి మంగళవారం ఈ చెక్కును ఇచ్చారు. ఈ సందర్భంగా కాకినాడ నగర అభివృద్ధి, స్మార్ట్ సిటీ నిధుల మంజూరు, పోర్టు తదితర అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు.



చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్

గాంధీనగర్: సహకార బ్యాంకు సీఈవో ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేదంటే సమ్మెకు దిగుతామని ఏపీ స్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ అనుబంధ) నాయకులు హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా సంఘ సమావేశం కాకినాడ పరిధిలోని సహకార రంగ ఉద్యోగుల భవనంలో మంగళవారం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరామయ్య, రాష్ట్ర కోశాధికారి పి.సత్యనారాయణలు మాట్లాడారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో ఈనెల 7న ఇచ్చిన ఉత్తర్వులో 2019 తర్వాత సహకార ఉద్యోగులుగా నియమించిన వారిని, 60 ఏళ్లు పూర్తయిన వారిని తొలగించాలని పేర్కొన్నారన్నారు. కోర్టు అనుమతిలేని వారు పొందిన జీతాలు తిరిగి చెల్లించాలన్నారు. బుధవారం నుంచి నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలన్నారు. 21న కాకినాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ నిబంధనల మేరకే 2019లో నియామకాలు జరిగాయన్నారు. అయిదేళ్ల సర్వీసు తర్వాత వారిని తొలగించడం చట్ట వ్యతిరేకమన్నారు. సహకార ఉద్యోగులు చేసే పోరాటాలకు సీఐటీయూ మద్దతు ఉంటుందన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు కె.ఆదినారాయణమూర్తి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సీఐటీయూ కోనసీమ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, తూగో.జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి బలరాం

బాలుడి మృతిపై అనుమానాలున్నాయ్..

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: 'మా బిడ్డ మృతిపై అనుమానాలున్నాయ్. పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి'అని మంగళవారం బాలుడి తల్లిదండ్రులు, బంధువులు కాకినాడ పరిధి నాగమల్లితోటలోని రాజేశ్వరి రెసిడెన్సీ అపార్టుమెంట్ ఆవరణలో మృతదేహంతో ఆందోళన చేశారు. సోమవారం అపార్టుమెంట్‌పైనుంచి పడి విద్యార్థి కుక్కల చరణ్ శ్రీతేజ(13) అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తయ్యాక నేరుగా అపార్టుమెంట్ ఆవరణలో మృతదేహంతో నిరసనకు దిగారు. మృతికి కారణాలు తెలపాలని, పోలీసులు సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాలుడి చిన్నాన్న వీరాంజనేయులు మాట్లాడుతూ బయటకు వెళ్తున్న చరణ్‌శ్రీతేజ ఎవరో పిలవడంతోనే అపార్టుమెంటుపైకి వెళ్లాడన్నారు. తర్వాత పైనుంచి పడి చనిపోయాడని పేర్కొన్నారు. ఇప్పటివరకు అపార్టుమెంట్ అసోసియేషన్‌వారు వచ్చి కనీసం బాధిత తల్లిదండ్రులను పలకరించలేదని, చంపేసి పడేశారనే అనుమానం తమకు ఉందని అన్నారు. తమ దర్యాప్తులో దోషులెవరో తేలితే కేసు నమోదుతో కఠిన చర్యలు తీసుకుంటామని సర్పవరం సీఐ పెద్దిరాజు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకునివెళ్లారు.



అపార్టుమెంట్ వద్ద బైఠాయించిన చరణ్‌శ్రీతేజ బంధువులు

సీహెచ్‌సీ ఉన్నతీకరణకు ప్రతిపాదనలు

పిఠాపురం: పిఠాపురంలో సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా ఉన్నతీకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రికి కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ సామాజిక బాధ్యతగా రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యూనిట్‌ను కలెక్టర్, మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాత కలిసి ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనల మేరకు ఆసుపత్రిలో సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు కలెక్టరు తెలిపారు. ఆసుపత్రి ఆధునికీకరణతోపాటు అవసరమైన సిబ్బందిని నియమిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు, కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ కాకినాడ జిల్లా యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు, జీఎంహెచ్‌ఆర్ పి.పద్మనాభం, సీఎస్ఆర్ మేనేజర్ కె.వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఎక్స్‌రే యూనిట్ ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్, మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు

పాఠశాలలో భోజనం నిర్వహణ తీరుపై ఆగ్రహం

పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ పాఠశాలలో విద్యార్థులకు కలెక్టర్ షాన్‌మోహన్ క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉండడం, ఆవరణలో వర్షం నీరు నిలిచిపోవడంతో విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సౌకర్యాలు మెరుగుపరచాలని ఆదేశించారు. రూ.16 లక్షల సీఎస్ఆర్ నిధులతో 21 రకాల క్రీడా సామగ్రిని 32 పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. తొలిదశలో 14 పాఠశాలలకు కిట్లు అందజేశామన్నారు. సామగ్రిని సక్రమంగా వినియోగించడం, క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించడంపై వ్యాయామోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి బి.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	157-00
డ్రెస్డ్	228-00
స్కిన్‌లెస్	259-00

ద్విచక్ర వాహనం దొంగిలించిన వ్యక్తి అరెస్టు

గండేపల్లి(జగ్గంపేట): ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు జగ్గంపేట ఎస్సై రఘునాధరావు తెలిపారు. వివరాలివీ.. ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన తుపాకుల రామదాసు అనే వ్యక్తి సోమవారం జగ్గంపేటలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ద్విచక్ర వాహనాన్ని దొంగిలించుకుపోయాడు. దీనిపై ద్విచక్ర వాహనదారుడు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తులో భాగంగా మంగళవారం ఉదయం గోకవరం రోడ్డులో వాహనాన్ని దొంగిలించిన వ్యక్తిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. దొంగను వెంటనే పట్టుకున్న ఎస్సైను సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అభినందించారు.

Collector's Office, Kakinada

Ref. Coordn/(Elecs)-1/188/2024. Dt. 15-10-2024

ANNEXURE A-1

ELECTION COMMISSION OF INDIA

Revision of Electoral Rolls for East-West Godavari Graduates' Constituency of Andhra Pradesh Legislative Council

Notice under rule 31(4) of the Registration of Electors Rules, 1960

In pursuance of rule 31(4) of the Registration of Electors Rules, 1960, the Electoral Registration Officer of East-West Godavari Graduates' Constituency vide Public notice Ref.Coordn/(Elecs)-1/188/2024, Dt.30-09-2024, called upon every person entitled to be registered In the electoral roll of the relevant Graduates' Constituency mentioned above, to send to, or deliver at, ERO's Office on or before 06-11-2024 (i.e., the last date of receipt of applications) application In Form-18 appended to the Registration of Electors Rules, 1960 and reproduced In the second schedule of the said notice published in the edition dated 30th September, 2024 of (1) Eenadu and (2) The New Indian Express News Papers.

All the above mentioned persons may submit their applications In Form-18 on or before 06-11-2024 (ie., the last date of receipt of applications), If not already done.

The said details are also available in the official website of the Chief Electoral Officer, Andhra Pradesh at www.ceoandhra.nic.in

Sd/- **Electoral Registration Officer**

East-West Godavari Graduates' Constituency & District Revenue Officer, Kakinada.

కాకినాడ


రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)



గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాటా - 36, వంకాయలు - 40,44,54, బెండకాయలు - 16, పచ్చిమిర్చి - 40,58, కాకరకాయ - 30, బీర - 24,34, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 40, క్యారెట్ - 40, దొండకాయలు - 28, బంగాళాదుంపలు - 30,36, ఉల్లి - 45,50, గోరుచిక్కుళ్లు - 34, దోసకాయలు - 36, ఆనబకాయ - 32,40, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 86, చేమదుంపలు - 30,46, మునగకాడలు - 8,10, బీట్‌రూట్ - 40, కీరదోస - 28, బీన్స్‌గింజలు - 130, అల్లం - 54, క్యాప్సికం - 96, బొబ్బర్లు - 46, చిలకడదుంపలు - 40, నిమ్మకాయలు(డజను) - 24,54.

నగరంలో సినిమాలు

గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- విశ్వం, వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, జనక అయితేగనక, సత్య సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- వెట్టయాన్ ది హంటర్, దేవర పార్ట్ 1, మానాన్న సూపర్‌హీరో, లక్ష్మీ- దేవర పార్ట్ 1, సత్యగౌరి- మానాన్న సూపర్‌హీరో, తిరుమల - వెట్టయాన్ ది హంటర్, సీఅండ్‌సీ 1- జనక అయితేగనక, సీఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ - మార్టిన్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- జనక అయితేగనక(ఉ,సా)విశ్వం(మ,రా), శ్రీశ్రీనివాసా(వేళంగి)- వెట్టయాన్ ది హంటర్(ఉ.సా)విశ్వం(మ.రా).



చెక్ అందిస్తున్న డా.సత్యనారాయణ తదితరులు

సీఎం సహాయ నిధికి విరాళం

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: కాకినాడ గాంధీనగర్‌కు చెందిన శ్రీ సాయి రాఘవేంద్ర సూపర్ స్పెషాలిటీస్ ఆసుపత్రి అధినేత డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, డాక్టర్ మడక రాంబాబులు రూ.2 లక్షల సాయాన్ని సీఎం సహాయ నిధికి అందించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం చంద్రబాబుకు చెక్ అందజేశారు. కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీల స్ఫూర్తితో బాధితులను ఆదుకునేందుకు ఈ సాయాన్ని అందించామని డా.సత్యనారాయణ తెలిపారు.

యువ అంకురాలు

వారంతా ఇంజినీరింగ్ విద్యార్థులు. అందరిలా పాఠాలు విన్నామా.. అసైన్‌మెంట్లు చేశామా.. పరీక్షలు రాశామా.. మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యామా అని ఆలోచించలేదు. భిన్నంగా ఆలోచించారు. ప్రస్తుత సమస్యలకు తమ ఆలోచనలతో పరిష్కారం చూపాలని అనుకున్నారు. వాటిని ఆచరణలో పెట్టారు. ఇటీవల సుబు కోట ఫౌండేషన్ సహకారంతో జేఎన్‌టీయూకే నిర్వహించిన స్టార్టప్ ఫెస్ట్-2024లో ప్రదర్శించారు. అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా వారి అనుభవాలు పంచుకున్నారిలా..– న్యూస్‌టుడే, గాంధీనగర్

రైళ్ల ప్రమాదాలకు అడ్డుకట్ట..



భానుప్రకాష్, ప్రణీత్, తేజ, దేవి

★ మేము రాజమహేంద్రవరంలోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాం. ఇటీవల రైళ్ల ప్రమాదాలు పెరిగాయి. దీన్ని ముందే పసిగట్టేలా యూఎల్ఆర్ఎస్ సిస్టం పేరుతో ఈ ప్రాజెక్టు తయారుచేస్తున్నాం. ఈ యంత్రాన్ని రైలు ఇంజిన్‌లో పెడతాం. అందులోని లైటర్ సెన్సార్ కి.మీ. వరకు కాంతిని ప్రసరిస్తుంది. ఎదురుగుండా ఏదైనా రైలు వస్తున్నా, ప్రమాదకర వస్తువులున్నా, పట్టాలు పాడైనా వెంటనే చెప్పేస్తుంది. సమాచారం లోకోపైలట్ నుంచి సమీపంలోని రైల్వే స్టేషన్లకు వెళ్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన హార్డ్‌వేర్ తయారుచేస్తున్నాం. ఇందులో జీఎస్ఎం సాంకేతికత వినియోగిస్తున్నాం.

బయోగ్యాస్ తయారీ..



సాత్విక్, పృథ్వీరామ్, లక్ష్మీనారాయణ, విష్ణు

★ జేఎన్‌టీయూకేలో ఈసీఈ మూడో ఏడాది చదువుతున్నాం. వ్యర్థాల సమస్య తగ్గించడానికి, పర్యావరణ రక్షణకు బయోమాస్ మేనేజ్‌మెంట్ అనే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం. దీంతో తడిచెత్తను వివిధ ప్రక్రియల్లో డీకంపోజ్ చేసి బయోగ్యాస్ తయారు చేయొచ్చు. ఈ తయారీలో మిథైన్ పర్యావరణంలోకి చేరకుండా చేయొచ్చు. బయోగ్యాస్ ప్లాంట్‌ను జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేసి, విజయవంతమైతే కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలు చేస్తాం. బయోగ్యాస్ స్టోరేజ్‌కు ట్యాంకులు ఏర్పాటు చేస్తాం. భవిష్యత్తులో సీఎన్‌జీకి ప్రత్యామ్నాయ ఇంధనంగా మార్చాలనేది మా ప్రయత్నం. ఏడాదిగా దీనిపై పనిచేస్తున్నాం.

విద్యార్థులకు చక్కని యాప్..

★ జేఎన్‌టీయూకేలో సీఎస్‌సీ రెండో ఏడాది చదువుతున్నాం. ఎడ్యు ఆల్ట్ టెక్ పేరుతో యాప్‌ను రూపొందిస్తున్నాం. ఇందులో రెగ్యులర్ విద్యతో పాటు, ప్రత్యామ్నాయ విద్యను నేర్చుకోవచ్చు. పాటలు, నృత్యం, చిత్రలేఖనం వంటి వాటిని నిపుణుల ద్వారా నేర్చుకోవచ్చు. మెంటర్లు, ప్రొవైడర్లు ఉంటారు. మెంటర్, ప్రొవైడర్‌లు ఉంటారు, విద్యార్థి సీకర్‌గా ఉంటారు. ఏ సమయంలోనైనా సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ఆయా అంశాల్లో నిపుణులనే మెంటర్లుగా తీసుకుంటాం.



చాందిని, లక్ష్మీఅపర్ణ, కుశీకౌల్, రిషిక, సుధీర్, రణదీప్, సత్యనారాయణ, ఉమాకృష్ణకాంత్

ప్లాస్టిక్ వ్యర్థాలకు చెక్..

★ జేఎన్‌టీయూకేలో మెకానికల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాం. ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగించాలనే ఉద్దేశంతో ది ట్రయల్ బ్లేజర్‌ను రూపొందిస్తున్నాం. ఈ ప్రాజెక్టులో ప్లాస్టిక్ వ్యర్థాలతో కార్లు, ద్విచక్రవాహనాలకు సంబంధించిన పరికరాలు, ప్యాకేజీ, బాటిళ్ల తయారీకి వినియోగించొచ్చు. ఫలితంగా కొంతమేర కాలుష్యం తగ్గి పర్యావరణానికి మేలు చేకూరుతుంది.



సమరీ, వి.లక్ష్మీసృజన, ఎం.ఆదిత్య, లోకేష్



నాణేలు అందిస్తున్న డిప్యూటీ రీజనల్ హెడ్

యూబీఐలో రూ.10 నాణేల పంపిణీ

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆర్బీఐ ఆదేశాల ప్రకారం రూ.10నాణేల చలామణి పెంచేలా యూనియన్ బ్యాంకు సోమ, మంగళవారాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాకినాడ రీజియన్ కార్యాలయ పరిధిలోని 80 బ్రాంచిల్లో రూ.10నాణేలను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా యూనియన్ బ్యాంకు కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని సిబ్బంది పాల్గొని నాణేల చెల్లుబాటులోని అపోహలు తొలగించారు. కార్యక్రమాల్లో బ్యాంకు కాకినాడ డిప్యూటీ రీజనల్ హెడ్ కృష్ణమాచారి, కరెన్సీ చెస్ట్ ఇన్‌ఛార్జి రామకృష్ణ, వివిధ బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీలో ప్రవేశానికి దరఖాస్తులు

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.బీవీ తిరుపణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 21లోగా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో 17 సీట్లు, ఎనలైటికల్ కెమిస్ట్రీలో 19 సీట్లు, జువాలజీలో 26, ఎం.కామ్ కోర్సులో 31 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్షణ ప్రవేశాల కోసం విద్యార్థులు పీజీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలన్నారు. దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలతో కళాశాల పీజీ డైరక్టర్ బి.చక్రవర్తిని సంప్రదించాలని సూచించారు.

అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: బాలాజీచెరువు ఎంసీపీఎస్ పాఠశాల ఆవరణలోని అర్బన్ భవిత సెంటర్‌లో మంగళవారం డిస్లెక్సియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీఎస్ పాఠశాల ఏరియా-1 ప్రధానోపాధ్యాయురాలు బొమ్మిడి నాగ పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా గౌరవ సాహిత విద్య సమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అభ్యాస వైకల్యాలు, పిల్లల పురోభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఐఈఆర్టీలు, ఉపాధ్యాయులు, కచేరిపేట పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గడియారం అందజేత

సాంబమూర్తినగర్: ప్రయాణికుల సౌకర్యార్థం కాకినాడ లలితా జ్యుయలరీ సిబ్బంది పెద్ద గడియారాన్ని కాకినాడ డిపో అసిస్టెంట్ ఎంయూవీ మనోహర్‌కు మంగళవారం అందజేశారు. టౌన్ రైల్వేస్టేషన్, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవాలయానికి గడియారాలు అందజేసినట్లు సిబ్బంది తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద..

కొమ్మలే.. సూచికలు

ఆకర్షణీయ నగరం.. అందులోనూ అధిక రద్దీ ఉండే రహదారులు.. జిల్లా ఉన్నతాధికారులు తిరిగే రోడ్లే ఇలా ఉంటే ఎలా అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ఆర్డీవో కార్యాలయం, జీజీహెచ్ వద్ద పులె బొమ్మ సెంటర్లలో రోడ్డు మధ్యలో గుంతలు పడ్డాయి. అందులో పలువురు వాహన చోదకులు పడి, ప్రమాదాల పాలయ్యారు. దీనితో కొంతమంది స్థానికులు ప్రమాద సూచిక తెలియజేస్తూ రాళ్లు, చెట్టు కొమ్మలను ఉంచారు. రాత్రిపూట గమనించని వారు అందులో పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా గోతులను పూడ్చేందుకైనా తగిన చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గాంధీనగర్



జీజీహెచ్ వద్ద..

నక్షాకు కాకినాడ ఎంపిక

కేంద్రం ఆధ్వర్యంలో త్వరలో భూముల రీ-సర్వే

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అర్బన్ ప్రాంతాల్లో భూముల రీ-సర్వేకు ప్రతిపాదించింది. నక్షా కార్యక్రమం కింద ల్యాండ్ సర్వేకు రాష్ట్రంలోని ఎనిమిది పట్టణ స్థానిక సంస్థలను ఎంపిక చేసింది. అందులో కాకినాడ నగరపాలక సంస్థకు చోటు దక్కింది. కుప్పం మున్సిపాలిటీ, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, ఒంగోలు, ఏలూరు, తిరుపతి, అనంతపురం నగరపాలక సంస్థల్లోనూ భూముల రీ-సర్వేను చేపట్టనున్నారు. నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హేబిటేషన్ పేరుతో దీన్ని నిర్వహించనున్నారు. దీనికి నక్షా అని నామకరణం చేశారు.

పైలెట్ ప్రాజెక్టుగా..

వైకాపా ప్రభుత్వంలో జగనన్న భూరక్ష పథకం కింద పట్టణ ప్రాంతాల్లో భూముల రీ-సర్వే చేపట్టారు. కాకినాడ నగరపాలక సంస్థలో మధ్యలో నిలిచిపోయింది. నగరం సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ ఖాళీల స్థలాల గుర్తింపు, వార్డు సరిహద్దులు గుర్తించి, డ్రోన్ ఫ్లైయింగ్ చేశారు. డ్రోన్ ఫ్లైయింగ్ డేటా ఎర్రర్ రావడం, ఈ ప్రక్రియ నిర్వహించిన సంస్థ చేతులెత్తేయడంతో మొత్తం ప్రక్రియ మొదటికి వచ్చింది. వైకాపా హయాంలో జరిగిన రీ-సర్వేను కొనసాగించకుండా కూటమి ప్రభుత్వం నిలిపేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కాకినాడ నగరపాలక సంస్థను భూముల రీ-సర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలో విడుదల చేయనుంది. ఇవి రాగానే ల్యాండ్ రికార్డులను అప్‌డేట్ చేస్తారు. వీటికి డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు.



గతంలో రీ-సర్వేలో గ్రౌండ్ సెంట్రల్ పాయింట్ నమోదు చేస్తున్న సిబ్బంది

ఇవీ ప్రయోజనాలు..


నగరం, వార్డు సరిహద్దులు నిర్ణయిస్తారు. డ్రోన్ ఫ్లయింగ్ ద్వారా మ్యాప్‌లు తయారు చేస్తారు. ఆస్తుల వారీగా సరిహద్దులు గుర్తించి, అసెస్‌మెంట్స్‌కు డిజిటల్ పత్రాలు అందజేస్తారు. కేంద్ర ప్రభుత్వం కాకినాడను రీ-సర్వే పైలెట్ ప్రాజెక్టుకును ఎంపిక చేసింది. పక్కాగా భూములు, ఆస్తుల సరిహద్దుల నిర్ధారణ జరుగుతుంది. గ్రౌండ్ సెంట్రల్ పాయింట్స్‌ను గుర్తించి రీ-సర్వే ప్రక్రియ చేపడతారు. నగరపాలక సంస్థ పరిధిలోని భూ రికార్డులన్నీ డిజిటలైజేషన్ అవుతాయి. భూ సమస్యల పరిష్కారానికి దోహదపడుతుంది. దీనిపై అసిస్టెంట్ సిటీ ప్లానర్ కేవీ నాగశాస్త్రులు న్యూస్‌టుడేతో మాట్లాడుతూ గతంలో చేపట్టిన భూములు, ఆస్తుల రీ-సర్వే కొత్తగా చేపట్టే ప్రాజెక్టుకు కొంతమేర ఉపయోగపడుతుందన్నారు. మార్గదర్శకాలు రాగానే ప్రక్రియ మొదలవుతుందన్నారు.

ఆదర్శమూర్తి అబ్దుల్ కలాం

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేష కృషిచేసిన మహనీయుడు మాజీ రాష్ట్రపతి డా.అబ్దుల్ కలాం అని నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు మండపాక సుబ్బు పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాం వర్మ, మండపాక నాగబాబు, కర్రి వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలాం చిత్రపటానికి నివాళులర్పించారు.

★ యంగ్ మైండ్స్ రేపటి కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డా.అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడి చిన్ని, పిల్లి గోవిందరాజులు మాట్లాడారు.

గాంధీనగర్: ఏపీజే.అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శమని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరక్టర్ బీఈవీఎల్.నాయుడు పేర్కొన్నారు. మంగళవారం లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో అబ్దుల్ కలాం 93వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కలాం జీవిత విశేషాలను విద్యార్థులు తప్పక చదవాలన్నారు.



తలుపులు బిగించారు

ఈనాడు కథనానికి స్పందన

సాంబమూర్తినగర్: నియంత్రికల ఫ్యూజు బాక్సులు ప్రమాదకరంగా మారాయి. రద్దీ ప్రదేశాలు, ఉద్యానాల వద్ద ఫ్యూజ్ బాక్సులు చేతికందే ఎత్తులో ఉండటంపై పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఈనెల 11న 'ప్రమాదమైనా పట్టించుకోరా..' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. డెయిరీఫారం కూడలి సమీపంలోని రాజీవ్ గృహకల్ప వద్ద ఫ్యూజ్ బాక్సులకు తలుపులు బిగించారు.

వాయుపుత్ర నమోస్తుతే



గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆంజనేయ స్వామి జన్మనక్షత్రం, స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం కలిసి రావడంతో మెయిన్‌రోడ్డు శ్రీసీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, తమలపాకులతో పూజ, గంగసింధూర అర్చనలు జరిగాయి. అనంతరం శ్రీసీతారామ పట్టాభిషేక పరివార సమేతంగా పూజలు చేసి, వడమాలలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి.

వెంకట్‌నగర్‌లో వెతలు



పచ్చగడ్డి పెరగడంతో కాలువలో కదలని మురుగు

మసీదు సెంటర్, సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: నగరంలోని అత్యంత ఆకర్షణీయ ప్రాంతంగా పేరొందిన 4వ డివిజన్‌లోని వెంకట్‌నగర్‌లో పలు సమస్యలు నెలకొన్నాయి. ఈ డివిజన్‌లో సుమారు నాలుగు వేల జనాభా నివసిస్తున్నారు. కాలువల్లో పూడిక తీయపోవడం, పచ్చగడ్డి, చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు పారట్లేదు. పైపులైన్ల లీకేజీ కారణంగా నీరు కలుషితం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. పలు రహదారులను తవ్వి పైపులైన్లు మరమ్మతులు చేసి, వాటిని చక్కదిద్దకుండా వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల పగలే వీధిదీపాలు వెలుగుతున్నాయి. మరికొన్ని చోట్ల రాత్రిపూట కూడా వెలగట్లేదు. కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ వెంకట్‌నగర్‌లోని నగరపాలకసంస్థ ఉద్యానంలో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. చిన్నారులు, సందర్శకులు సంచరించేందుకు వీలులేకుండా ఉంది. పార్కులోని వాకింగ్ ట్రాక్ సైతం అధ్వానంగా ఉంది. ట్రాక్ చుట్టూ పిచ్చిమొక్కలు, ఎండిన చెట్టుకొమ్మలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు లేవు. కూర్చునేందుకు బల్లలు లేవు, ఉన్నవి విరిగిపోయాయి. పార్కు ప్రాంగణంలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన బాస్కెట్ బాల్ కోర్టు దయనీయంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



నగరపాలక సంస్థ ఉద్యాన ప్రాంగణం ఇలా..

నవంబరు 7 నుంచి గంధోత్సవం

సాంబమూర్తినగర్: కాకినాడ 32వ డివిజన్ రామకృష్ణారావుపేటలోని కొత్తూరు జెండా సెంటర్లో నవంబరు 7 నుంచి 10 వరకు హజ్రత్ మహబూబ్ సుభాని 48వ గంధోత్సవం నిర్వహించనున్నట్లు జెండా కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 4 రోజులపాటు జరిగే కార్యక్రమంలో గంధోత్సవం ఊరేగింపుతో పాటు పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. చివరి రోజు జెండా వద్ద ఫాతెహా ఖాని అనంతరం ఆమ్‌ఖాస్ దావత్(అన్నదానం) జరుగుతుందన్నారు. కులమతాలకతీతంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ముస్లిం, హిందు, క్రైస్తవ సోదరులు పాల్గొనాలని కమిటీ కోరింది.

కుంభాభిషేకం రోడ్డు అభివృద్ధికి వినతి

సాంబమూర్తినగర్, కాకినాడ నగరం: కాకినాడ దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం రేవుకు వెళ్లే రోడ్డు ఈతకొలనును తలపిస్తోందని నగర తెదేపా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశాల మేరకు పోర్టు అధికారి ధర్మశాస్త్రకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నగర తెదేపా ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్ మాట్లాడుతూ అయిదేళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోక అధ్వాన్నస్థితిలో ఉందన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్తూ నిత్యం ఈ రహదారిపై ప్రమాదాలకు గురవుతున్నారని, వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఈ రోడ్డును నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కొండబాబు సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లారన్నారు. కార్యక్రమంలో మూగిరాజు, చౌడుపల్లి సతీష్, తుమ్మల కొండలరావు, వైఎన్ఆర్, గంపల లక్ష్మణరావు, పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

చికిత్సపొందుతూ యువతి మృతి

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ గొడారిగుంటకి చెందిన ఎస్.యామని జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. వ్యక్తిగత కారణాలతో గడ్డిమందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. ప్రథమ చికిత్స అనంతరం ఈనెల 14న జీజీహెచ్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందగా సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్ఎస్ఎస్ ప్రీ పరేడ్‌కు ఎంపికలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూకే ప్రాంగణంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ పరేడ్ క్యాంప్ ఎంపికలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టరేట్ నుంచి వచ్చిన సైదా రమావత్ ఎంపిక అధికారిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల నుంచి సుమారు 100మంది హాజరయ్యారు. ఎత్తు, బరువు, పరుగుపందెం, మేధో నైపుణ్యం, సాంస్కృతిక ప్రతిభ, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సమాజ సేవా గుణాలను పెంచేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు నవంబర్ 12 నుంచి 22 వరకు మహారాష్ట్రలోని జలగావ్ యూనివర్సిటీలో జరిగే తదుపరి పోటీల్లో పాల్గొంటారన్నారు. జేఎన్‌టీయూకే ఎన్ఎస్ఎస్ యూనిట్, యూసీఈకే యూనిట్ 1, 2 ప్రోగ్రాం అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఎంపికైన వారితో ఎన్ఎస్ఎస్ అధికారులు

కార్పొరేషన్ కబుర్లు

కమిషనర్ సమీక్ష: మున్సిపల్ కమిషనర్ భావన మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో విభాగాధిపతులతో సమీక్షించారు. ఈనెల 19న పురపాలక శాఖ కమిషనర్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో నిర్దేశిత పది అంశాలపై సమీక్షలో చర్చించారు. చెత్త సేకరణ, పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా, తదితర అంశాలపై సమీక్షించి, నివేదికలు తీసుకున్నారు.

డ్రెయిన్ల పరిశీలన: భారీ వర్ష సూచన నేపథ్యంలో మంగళవారం నగరంలోని పలు మేజర్ డ్రెయిన్లను స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ పరిశీలించారు. కాలువల్లో నీటి ప్రవాహాన్ని పరిశీలించి, పూడిక లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. శివారు ప్రాంతాల్లో డ్రెయిన్ల అవుట్‌లెట్ల వద్ద వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.

తాగునీటి ప్లాంట్లు..: వాటర్‌వర్క్స్ ఇంజినీర్లు మంగళవారం శశికాంత్‌నగర్, విక్టోరియా వాటర్ వర్క్స్‌లోని తాగునీటి శుద్ధి ప్లాంట్లను పరిశీలించారు. సామర్లకోట వద్ద గోదావరి కాలువలో నీటి నమూనాలను సేకరించారు. వర్షాల నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ముంచెత్తిన వాన

సాంబమూర్తినగర్, మసీదు సెంటర్: నగరంలో మంగళవారం తెల్లవారుజామున నుంచి ఉదయం వరకు కురిసిన వర్షానికి పలు రహదారులు ముంపునకు గురయ్యాయి. శ్రీనగర్, సినిమారోడ్డు, చిన్నమార్కెట్, కొత్తకాకినాడ, శాంతినగర్, పోస్టల్‌కాలనీ, కొత్తపేట మార్కెట్, భాస్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచింది. పలు ఉద్యానాలు, క్రీడామైదానాలు, టౌన్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోనూ నీరు నిలిచింది. కాలువల్లోని మురుగు రోడ్డుపై చేరింది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.



శశికాంత్‌నగర్ ప్రధాన రహదారి



కొత్తకాకినాడ కూడలి వద్ద నిలిచిన వర్షపు నీరు



కొండయ్యపాలెం వంతెన కింద వర్షపునీటిలో..

కాకినాడ గ్రామీణం
• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పెదపూడి: పెదపూడి శ్రీ సత్యసాయి సేవా కేంద్రం వద్ద 17న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా సత్య సాయిబాబా సేవా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు తెలిపారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా గోవమ్మతల్లి తీర్థం

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ బాబా నగర్‌లో గోవమ్మతల్లి జాతర, తీర్థమహోత్సవాలు మంగళవారం ముగిశాయి. గరగల నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చింతా లక్ష్మణస్వామి, సంగాడి కామేశ్వరరావు పర్యవేక్షించారు.

గొల్లప్రోలులో తాగునీటి ఎద్దడి

గొల్లప్రోలు: స్థానిక పల్లపువీధి, పాత ఆంధ్రా బ్యాంకు, రంగప్ప చెరువు వీధి తదితర ప్రాంతాల్లో కొళాయిల ద్వారా రక్షిత నీటి సరఫరా నాలుగు రోజులుగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాటిపర్తిలోని మూడు బోర్లలో ఒకటి దీర్ఘకాలంగా పనిచేయక పోగా, మరొకటి ఇటీవల మరమ్మతులకు గురయ్యింది. ఏలేరు కాలువ నుంచి నీటి సరఫరా చేసే పంపుహౌస్ ప్రాంతంలో గతనెలలో సంభవించిన వరదలకు గట్టుకు గండి పడడంతో నీరు నిలువక సమస్య ఏర్పడింది. పంపు హౌస్‌లో రెండు మోటార్లు ఉన్నప్పటికీ నీరందక ఒక మోటారుతోనే తోడుతుండడంతో రక్షితనీటి ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగడంలేదు. ఆదీనిపై నగర పంచాయతీ ఏఈ ప్రభాకరరావును వివరణ కోరగా, మోటార్ల మరమ్మతులు నిర్వహిస్తున్నామని, త్వరలో సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సాయి సత్యవ్రతాలు

రమణయ్యపేట: కాకినాడ గ్రామీణం రమణయ్యపేట పంచాయతీ ఏపీఐఐసీ కాలనీలోని సాయిబాబా ఆలయంలో దసరా ఉత్సవాలు, సాయి పుణ్యతిథి కార్యక్రమాలు పురస్కరించుకుని సోమవారం సాయిబాబా పంచామృత అభిషేకాలు, సత్యవ్రతాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పట్టుతప్పి.. నష్టాలగూడు..!

పట్టు పురుగులను నిర్ణీతకాలం పెంచినా గూళ్లు తయారు కాకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలులో గత నెల 16 నుంచి తెచ్చిన గుడ్లను పొదిగించారు. చాకీ కేంద్రంలో తయారైన పట్టు పురుగులను షెడ్లలో రైతులు పెంచారు. నిర్ణీత కాలం ముగిసినా పట్టుగూళ్లు తయారు కాకుండా పురుగులుగానే మిగిలి ఉండడంతో జన్యుపరమైన లోపంతో తయారైన గుడ్లను సరఫరా చేయడంతోనే తాము రూ.10 లక్షల మేర నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

న్యూస్‌టుడే, గొల్లప్రోలు

గత నెల 16న తేదీనుంచి సరఫరా అయిన గుడ్లకు సంబంధించి పట్టుగూళ్ల దిగుబడి స్వల్పంగా లభించి సుమారు 30 మంది రైతులు నష్టపోయారు. గత నెల 16 నుంచి 23వ తేదీ వరకు 12 మంది రైతులకు 20 వేల గుడ్లు సరఫరా అయ్యాయి. ఈ లాటుకు చెందిన గుడ్ల నుంచి తయారైన పట్టుపురుగులు గూళ్లు అల్లేదశకు పెరిగి చివరి దశకు చేరుకున్నా గూళ్లు కట్టలేదు. రామ్‌నగర్‌లోని సెంట్రల్ సిల్క్ బోర్డు సిల్క్‌వామ్ సీడ్ ప్రొడక్షన్ సెంటర్ నుంచి బైవోల్టిన్ హైబ్రిడ్ గుడ్లను ముగ్గురు వ్యక్తులు రైతులకు సరఫరా చేశారు. గుడ్లను సింహాద్రిపురం, సోమవరం గ్రామాల్లోని చాకీ కేంద్రాల్లో పొదిగించి పురుగులను షెడ్లకు సరఫరా చేశారు. 21 రోజులకే గూళ్లు రావాల్సివుండగా 26 రోజులైనా తయారు కాలేదన్నారు. చేబ్రోలులోని 12 షెడ్లలో పెంచిన పట్టుపురుగులను గూళ్లు తయారుకాకుండా మిగిలిపోవడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంతా కేంద్రం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. అధికారులను కలిసి సమస్య వివరించారు.


గూళ్లు తయారుకాని పట్టుపురుగులను పరిశీలిస్తున్న పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారిణి గీతారాణి

రూ.75 వేలు నష్టం

అయిదెకరాల్లో మల్బరీ తోట సాగుచేసి రూ.10 వేలతో 450 గుడ్లు కొనుగోలుచేసి పట్టుపురుగులు పెంచా. రెండున్నర ఎకరాల తోటలోని నాణ్యమైన మల్బరీ ఆకుతో పట్టుపురుగులను ఆరోగ్యంగా పెంచా. 26 రోజులైనా గూళ్లు తయారుకాలేదు. దాంతో రూ.75 వేలు నష్టపోయా.



- దూళ్ల తిరుపతిరావు, పట్టురైతు, చేబ్రోలు

ఉన్నతాధికారులకు నివేదించాం

చేబ్రోలులో పట్టు పురుగులు పెంచినా గూళ్లు తయారుకాక నష్టపోయిన రైతుల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాం. షెడ్లలో పట్టు పురుగులను పరిశీలించాం. ప్రస్తుతం 12 షెడ్లలో 20 వేల గుడ్లకు సంబంధించి పట్టుపురుగులు గూళ్లు తయారుకాకుండా ఉన్నాయి. గుడ్లు సరఫరా చేసిన కంపెనీ ప్రతినిధులతో ఉన్నతాధికారులు చర్చిస్తున్నారు.

- మోసయ్య, పట్టుపరిశ్రమశాఖ అధికారి

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

పెద్దాపురం: ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి న్యాయం చేయాలని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోని తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటు నమోదు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. డీటీ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గొల్లప్రోలు: తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు కేవీవీ సత్యనారాయణ తెలిపారు. 17 వరకు నిరవధికంగా పని చేస్తుందని చెప్పారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచండి

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని, వెనుకబాటులో ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధచూపాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ సూచించారు. కాకినాడ గ్రామీణం వాకలపూడిలోని ఎంపీపీ పాఠశాలను మంగళవారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాలుగేళ్లకు విద్యార్థులకు శుద్ధజలం

● పవన్‌కల్యాణ్ చొరవతో సమస్య పరిష్కారం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో దీర్ఘకాలంగా నెలకొన్న తాగునీటి సమస్య ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఎట్టకేలకు పరిష్కారమయింది. ప్రత్యేకంగా పైపులైను, మోటారు ఏర్పాటు చేసి నాలుగేళ్ల అనంతరం ఆర్వో ప్లాంటును వినియోగంలోకి తేవడంతో 449 విద్యార్థులకు శుద్ధ జలం అందుబాటులోకి వచ్చింది. ఆర్వో ప్లాంటు నిరుపయోగంగా ఉండటంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని అధికారుల ద్వారా తెలుసుకున్న పవన్‌కల్యాణ్... తక్షణం వినియోగంలోకి తేవాలని జిల్లా కలెక్టరుకు ఆదేశాలు జారీ చేశారు. పైపులైను, మోటారు ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 4 లక్షలు మంజూరు చేస్తూ వెంటనే పనులు నిర్వహించాలని ప్రజారోగ్య శాఖ ఈఈ గంగరాజును కలెక్టరు ఆదేశించారు. మూడు రోజుల పాటు పనులు చేసి ప్లాంటును వినియోగంలోకి తెచ్చారు. పాఠశాలలో ఆర్వో ప్లాంటు వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేసిన ఉప ముఖ్యమంత్రికి, అధికారులకు హెచ్ఎం ఎ.ప్రేమకుమారి, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.


సీసాల్లో శుద్ధజలం పట్టుకుంటున్న విద్యార్థులు

భాజపా సభ్యత్వాల నమోదు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణంలో భాజపా నాయకులు మంగళవారం ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ సభ్యురాలిగా నియమితులైన తుమ్మల పద్మజాలక్ష్మిని సత్కరించారు. నాయకులు రావూరి సుధ, కాటంరెడ్డి ఏడుకొండలు, గొరకపూడి చిన్నయ్యదొర, దుర్గా మోహనరావు, అల్లు ప్రసాద్, చెరుకూరి రవికృష్ణ, కొక్కిలిగడ్డ గంగరాజు, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు ఏడిద కృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


పెద్దాపురంలో పద్మజాలక్ష్మిని సత్కరిస్తున్న భాజపా నాయకులు

సామర్లకోట, న్యూస్‌టుడే: దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నది, అత్యధిక సభ్యత్వాలు ఉన్న పార్టీ భాజపా అని పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి రావూరి సుధా అన్నారు. మంగళవారం పట్టణంలోని బళ్ల మార్కెట్, కోదండరామపురంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాటంరెడ్డి ఏడుకొండలు, కార్యక్రమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొరకపూడి చిన్నయ్యదొర ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వాల నమోదులో ఆయన పాల్గొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కిలిగడ్డ గంగారాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏడిద కృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు బక్కి వీర్రాజు, సుంకవిల్లి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌ను కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు మంగళవారం తనిఖీ చేశారు. నమోదైన కేసుల్లో పురోగతిని పరిశీలించారు. దస్త్రాలను తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలపై ఎస్సై ఎన్.రామకృష్ణతో సమీక్షించారు.

ప్రశస్త యాప్‌లో వివరాలు నమోదు చేయండి

గొల్లప్రోలు: పాఠశాలల్లో దివ్యాంగ విద్యార్థుల వివరాలను ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలని ఐఈఆర్టీలను సర్వశిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం గొల్లప్రోలులో భవిత కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించి దస్త్రాలను తనిఖీ చేశారు. ఐఈఆర్టీలు ఎం.రాజేష్‌బాబు, సీహెచ్ రాజ్యలక్ష్మితో సమీక్షించారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బడిఈడు దివ్యాంగ బాలలకు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ సేవలు అందించేందకు భవిత కేంద్రాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

కాజులూరు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొని ఆర్యవటం గ్రామానికి చెందిన గిరిజాల శ్యామల (63) మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్యామల సోమవారం సాయంత్రం బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్లి వస్తున్నారు. తన ఇంటి సమీపానికి వచ్చేసరికి అదే గ్రామానికి చెందిన మణికంఠ ద్రాక్షారామ నుంచి కాకినాడ వైపు ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో శ్యామల తీవ్రగాయాల పాలైంది. స్థానికులు, కుటుంబసభ్యులు గమనించి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందారు. దీనిపై ఎస్సై ఎం.మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విష రసాయనం తాగి యువకుడు..

కరప: ఆర్థిక ఇబ్బందులతో విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వేములవాడకు చెందిన పెరుమాళ్ల జాన్(19) కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కరప ఎస్సై తోట సునీత తెలిపారు. స్థానిక పెట్రోల్ బంకులో పనిచేసే జాన్ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. సోమవారం సాయంత్రం యండమూరు శివారు పొలాల్లో విష రసాయనం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తండ్రి వాసు ఘటన స్థలానికి చేరుకుని అతన్ని గొల్లపాలెంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొత్తపల్లి, న్యూస్‌టుడే: కోనపాపపేటలోని చింతకాయల జగన్నాథం ఇంట్లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాలోని నగదు, ఏడు కాసుల బంగారు ఆభరణాలు చోరీ చేశారని ఎస్సై వెంకటేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం జగన్నాథం కుటుంబ సమేతంగా విజయవాడ కనకదుర్గ ఆలయానికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటి తలుపులు పగిలి ఉండడాన్ని స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. వారు విజయవాడ నుంచి ఇంటికి చేరుకుని పరిశీలించి బీరువాలో నగదు, బంగారు వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, పిఠాపురం సీఐ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు.


పనసపాడులో ఎమ్మెల్యే చినరాజప్ప తదితరులు


రాపర్తిలో మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌ఛార్జి శ్రీనివాస్


చొల్లంగిలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు


రమణయ్యపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

పల్లె పండగతో కొత్త కళ

సామర్లకోట గ్రామీణం: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండగతో గ్రామాలు కొత్త కళ సంతరించుకుంటాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం పనసపాడులో పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచి చీకట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెల్లో అభివృద్ధి పరుగు పెడుతోందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాపర్తి గ్రామంలో పల్లె పండగ.. పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, పి.రాయవరం, పి.తిమ్మాపురం, వెల్దుర్తి, పి.దొంతమూరు, బి.కొత్తూరు గ్రామాల్లో 27 పనులు మొదలుపెట్టారు. పంచాయతీ రాజ్, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండలంలోని 11 పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులు రూ.3.43 కోట్లతో 5 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు భూమి పూజ చేశారు. జి.వేమవరం గండివారి పాలెంలో వృద్ధురాలు పుణ్యమంతుల సత్యవతి పింఛను అందడం లేదంటూ ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీవో కోటిపల్లి సత్యనారాయణకు సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి పిల్లలతో కొద్దిసేపు ఆయన ముచ్చటించారు. ఎంపీపీ రాయుడు సునీత, తెదేపా మండల కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

84 పనులకు రూ.6.87 కోట్లు..

సర్పవరం జంక్షన్(రమణయ్యపేట): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేసే దిశగా అడుగులు వేస్తూ గ్రామగ్రామాన పండగ వాతావరణంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. కాకినాడ గ్రామీణం, నేమాం, వాకలపూడి, రమణయ్యపేట, వలసపాకల గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమంలో పలు రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంపీపీ వీరిష, కార్యదర్శులు నరసింహారావు, పాండురంగారావు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యసన వైకల్యంపై అవగాహన

పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో నిర్దిష్ట అభ్యసన వైకల్యాలు (డిస్లెక్సియా)పై అవగాహన కల్పించి, దాన్నుంచి వారు బయటపడేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో శ్యాంబాబు తెలిపారు. మంగళవారం పిఠాపురం భవిత కేంద్రం, భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమేష్, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు రాజ్‌ఖుమార్, పీడీ సుధారాణి, సీఆర్‌పీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ● సామర్లకోట అయోధ్యరామపురంలో బచ్చు ఫౌండేషన్ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో నిర్దిష్ట అభ్యసన వైకల్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంఈవో వై.శివరామకృష్ణయ్య మాట్లాడారు. పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఉపాధ్యాయుడు తోటకూర సాయి రామకృష్ణ పాల్గొన్నారు. ● పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల అవగాహన ర్యాలీని ప్రధానోపాధ్యాయిని ఆర్.నాగజ్యోతి ప్రారంభించారు. ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయిని ఎం.వీరభవాని, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు. ● గొల్లప్రోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో-2 శివప్రసాద్ మాట్లాడారు. స్పెషల్ ఎడ్యుకేటర్ గిరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఎ.ప్రేమకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **పెదపూడి:** విద్యార్థులు అభ్యసన వైకల్యాన్ని సమర్థతతో అధిగమించాలని ఎంఈవో సి.వి.వి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం పెదపూడి మండలం జి.మామిడాడలో జడ్పీ బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటరెడ్డి, ఎస్.వి.రామారెడ్డి పాల్గొన్నారు.



పిఠాపురంలో..


చంద్రమాంపల్లిలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ర్యాలీ

అబ్దుల్ కలాం యువతకు ఆదర్శం

పిఠాపురం, పెద్దాపురం, కరప, గొల్లప్రోలు, కాజులూరు, సర్పవరం జంక్షన్: మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నత భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలని పలువురు నాయకులు కోరారు. మంగళవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక పెట్రోల్ బంకు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. శేఖర్, శంకరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ● పెద్దాపురం రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్, కరప మండలం నడకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల, గొల్లప్రోలు గాంధీనగర్‌లోని స్వామి వివేకానంద జ్ఞాన మందిరం, చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. కాజులూరు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, గొల్లపాలెం పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో, కాకినాడ గ్రామీణ మండలం ఇంద్రపాలెంలోని ఉద్యానంలో కలాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో మనం ఫౌండేషన్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, స్టీఫెన్ ఆధ్వర్యంలో జె.జి.ఆర్. ఆసుపత్రి వైద్యులు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.


గొల్లప్రోలులో కలాం విగ్రహం వద్ద..


పెద్దాపురం శ్రీప్రకాష్ స్కూలులో అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ప్రొఫెసర్ సంతానం, విద్యార్థులు

సాదాసీదాగా మండల సమావేశం

కరప: కరపలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి సరిపడా కోరం(సభ్యులు) లేకపోవడంతో కాసేపు నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ తరువాత పలువురు ఎంపీటీసీ సభ్యులకు ఫోన్ చేసి రప్పించడంతో సమావేశాన్ని ఆలస్యంగా ప్రారంభించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎంపీడీవో అనుపమ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. ఎంపీడీవో అనుపమ శాఖల వారీగా ప్రగతి, చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించారు. వేములవాడలో ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, మంచినీరు ఒక్కోసారి రంగుమారి వస్తున్నాయని ఎంపీటీసీ సభ్యుడు పాలిక శ్రీనివాస్ తెలిపారు. పెద్దాపురప్పాడులో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉప సర్పంచి శ్రీనివాస అప్పారావు ఆరోపించారు. తహసీల్దారు సత్యనారాయణ, ఏవో రాజేష్, డాక్టర్ శ్రీనివాస నాయక్, ఎంఈవో బులికృష్ణవేణి, ఏఈ ఈశ్వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, ఎంపీడీవో అనుపమ

తుని
• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి


19వ వార్డులో స్థానికులతో కమిషనర్ సత్యనారాయణ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: నగర పంచాయతీ 19వ వార్డులో మంగళవారం కమిషనర్ ఎం.సత్యనారాయణ తన సిబ్బందితో పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వై.నాగబాబు, వార్డు ఇన్‌ఛార్జి బాబ్జీ, స్థానికుడు పాండ్రింకి రామోహ్మనరావు తదితరులు ఉన్నారు.

అబ్దుల్ కలాం సేవలు ఆదర్శం


జగ్గంపేట గ్రంథాలయంలో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు

గండేపల్లి(జగ్గంపేట): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం సేవలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జగ్గంపేట ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త కొండబాబు అన్నారు. మంగళవారం జగ్గంపేట గ్రంథాలయంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

● సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో కలాం జయంతి వేడుకలు జరిగాయి. ప్రిన్సిపల్ కుమార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల్లా రహదారులు


కత్తిపూడి- రౌతులపూడి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి

శంఖవరం, న్యూస్‌టుడే: మండలంలోని రహదారులు ఛిద్రమయ్యాయి. కత్తిపూడి- రౌతులపూడి వెళ్లే ప్రధాన రహదారి భారీ గుంతలతో ఉంది. ఈ మార్గంలో వేల వాహనాలు రోజూ రాకపోకలు సాగిస్తుంటాయి. చిన్నపాటి వర్షం పడితే గుంతల్లో వర్షపు నీరు చేరి చెరువుల్లా మారుతున్నాయి. గత పాలనలో రహదారులకు కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి. శంఖవరం నుంచి వేళంగి వెళ్లే రహదారి ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉంది. ఈ రహదారి అభివృద్ధితో గిరిజనులకు విద్య, వైద్యం, సరకు రవాణా వంటి ఇబ్బందులు తప్పుతాయి. గత ప్రభుత్వంతో నిధులు మంజూరైనా సగం వేసి వదిలేయడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతైనా రహదారులు బాగు చేస్తారంటూ గంపెడాశతో ఇక్కడి ప్రజలు ఎదురు చూస్తున్నారు.

రోడ్డు ఎత్తు.. బురదతో చిత్తు..!

✦ బాగున్న మార్గాన్ని అధ్వానం చేశారు..

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

లక్షణంగా ఉన్న సిమెంటు రోడ్డును ఎత్తు చేద్దామని మట్టి పోస్తే గోతులమయమై దిగబడిపోతోంది. ఊరి జనానికి బురద మిగులుతోంది. ఏలేశ్వరం శాంతి ఆశ్రమం ర.భ. రోడ్డులో భాగంగా ఉన్న గజ్జనపూడి గ్రామ పరిధిలోని రహదారి పరిస్థితి ఇదీ. 2018లో వేసిన సిమెంటు రోడ్డు లోతట్టుగా ఉందని మెరక చేసే ప్రయత్నం ఏడాదిన్నరగా పూర్తికాలేదు. ఎర్ర మట్టి, నల్ల బూడిద పరిచి ఊరుకున్నారు. మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలతో ఈ రోడ్డుపై గుంతలు వాహనచోదకులను ఇబ్బంది పెడుతున్నాయి. లోడుతో వెళ్తున్న వాహనాలు దిగబడిపోతున్నాయి. రోడ్డు మార్గాని ఎత్తు చేయబోతే మరోలా గజ్జనపూడి ప్రధాన రహదారి అయ్యింది. గ్రామంలోని రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి కొత్త సచివాలయం వరకూ సుమారు 700 మీటర్ల మేర సవ్యంగా ఉన్న రోడ్డు ఇలా తయారైంది. రోడ్లకు నిధులు లేక మరమ్మతులకు నోచక పలుచోట్ల గుంతల్లో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. సవ్యంగా ఉన్న రోడ్డును అధ్వానంగా మార్చారని గజ్జనపూడి పరిసర గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్వపు సిమెంటు రోడ్డును పునరుద్ధరించినా చాలని కోరుతున్నారు. దీనిపై ఏలేశ్వరం ర.భ. అధికారిని వివరణ కోరగా ఇటీవలే బాధ్యతలు చేపట్టానని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


గజ్జనపూడిలో మెరక చేసిన రోడ్డు ఇలా..


గోతిలో పడి ట్రాక్టరు ముందు చక్రాలు తెలిపోయి..

ప్రమాదకరంగా పచ్చదనం




కొలిమేరు సమీపంలో మలుపువద్ద పెరిగిన పిచ్చిమొక్కలు, మొక్కల మధ్య రహదారి పక్కన రక్షణ గ్రిల్

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తరచూ కురుస్తున్న వర్షాలతో రోడ్ల ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి పచ్చదనం ఆహ్లాదంగా ఉన్నప్పటికీ వాటి మాటున ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రధానంగా తుని నుంచి కొలిమేరు, ఎన్‌ఎస్వీ నగరం తదితర గ్రామాలకు వెళ్లే రహదారి వెంబడి పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈ రోడ్డు మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనం అతి సమీపంలోకి వస్తేగాని కనిపించడం లేదు. దీంతో ఇటీవల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొలిమేరు సమీపంలో తాండవ తీరం వెంబడి ఉన్న రహదారికి నదిలోకి వాహనాలు దూసుకెళ్లకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన రక్షణ గ్రిల్, హెచ్చరిక బోర్డులు సైతం కనిపించకుండా పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఈ పరిస్థితుల్లో సంబంధిత అధికారులు రహదారి వెంబడి పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి ప్రమాదాలను నివారించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

లోకేశ్‌ను కలిసిన భాజపా అధ్యక్షుడు


మంత్రి లోకేశ్‌తో రామ్‌కుమార్

రౌతులపూడి, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్‌ను మంగళగిరిలోని ఆయన నివాసంలో కలిసి పలు అంశాలపై చర్చించినట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తెలిపారు. జిల్లాకు సంబంధించిన పలు విషయాలను ఆయన దృష్టిలో ఉంచామన్నారు.

సోము వీర్రాజు జన్మదినం


వీర్రాజును కలిసిన రమేష్, తదితరులు

గండేపల్లి,(జగ్గంపేట) న్యూస్‌టుడే: భాజపా నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని సోము వీర్రాజు స్వగృహంలో కలిసిన రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనసేన, భాజపా నాయకులు ఉన్నారు.

పది రోజుల్లో వినతులకు పరిష్కారం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటైంది. కమిషనర్ ఎం.సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి జేడీ ఆనంద్, ఏఈ అనూష లక్ష్మి, పారిశుద్ధ్య తనిఖీ అధికారి కుమార్‌రాజా తదితరులు హాజరయ్యారు. ప్రజల నుంచి సమస్యలపై వచ్చే ఫిర్యాదు, వినతులకు పది రోజుల్లో పూర్తి స్థాయి పరిష్కారం చూపాలని ఛైర్‌పర్సన్ ఆదేశించారు. కౌన్సిలర్ అలమండ చలమయ్య పాల్గొన్నారు.

వైకల్యం చదువుకు ఆటంకం కాకూడదు

కిర్లంపూడి, ఏలేశ్వరం, తుని పట్టణం, శంఖవరం, న్యూస్‌టుడే: వైకల్యం విద్యాభ్యాసానికి అవరోధం కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని ఉప విద్యాశాఖాధికారి, ఎంఈవోలు, హెచ్ఎంలు పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలుగల పిల్లలను ప్రశస్త యాప్ ద్వారా గుర్తించి వారి అవసరాలకు తగ్గట్టు చదువునందించాలని తెలిపారు. డిస్లెక్సియా అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకుని కిర్లంపూడి, సోమవరం గ్రామ, ఏలేశ్వరం, తుని పట్టణం, శంఖవరం పాఠశాలల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు ఇందుకోసం ఐదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


శంఖవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


తునిలో ప్రదర్శనగా..


కిర్లంపూడి పాఠశాల ఆవరణలో..

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు: సీఐ

తుని, న్యూస్‌టుడే: యువత బంగారు భవిష్యత్తును పణంగా పెట్టి మత్తుకు బానిసలు కావద్దని పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ హితవు పలికారు. పట్టణంలోని వివేకా, వినంద కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాలను వినియోగించవద్దని సూచించారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈవ్‌టీజింగ్, ఇతర ఇబ్బందులు ఉంటే విద్యార్థినులు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని, ఏ ఒక్కరూ నిబంధనలు అతిక్రమించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో భోజనాలు

గండేపల్లి(జగ్గంపేట)న్యూస్‌టుడే: జగ్గంపేట పాతపోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం జనసేన ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. జనసేన నాయకులు మాట్లాడుతూ ప్రతీ మంగళవారం జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో పేదలకు భోజనాలు పెడుతున్నట్లు తెలిపారు. ఈ వారం రాజమహేంద్రవరానికి చెందిన మాణిక్యాలరావు ఆర్థిక సాయంతో ఈ క్యాంటీన్ నిర్వహించినట్లు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా ఉంటాం


మూడుచక్రాల సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు: విభిన్న ప్రతిభావంతులు ధైర్యంగా అన్నింటా రాణించేలా ప్రభుత్వం చేదోడుగా ఉంటుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛను పెంపుదలతో పాటు ఉపకరణాల పంపిణీ సత్వరమే జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆగస్టులో నిర్వహించిన శిబిరంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఉపకరణాలు వచ్చాయని, ప్రతి అర్హుడికి మంజూరయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచి గుడాల విజయలక్ష్మి, ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి, నాయకులతో కలిసి 209 మందికి 321 ఉపకరణాలను ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీడీవో కుమార్‌బాబు, ఎంఈవో రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దేవస్థానం బస్సుల్లేక భక్తులకు ఇబ్బంది

అన్నవరం: సత్యదేవుని దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు రవాణా ఏర్పాట్లు సరిగా లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో కొండ దిగువ నుంచి కొండపైకి వెళ్లేందుకు బస్సులు లేక భక్తులు ఇబ్బందిపడ్డారు. బస్సు కోసం సుమారు గంట వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఆ విభాగ అధికారులు బస్సును ఏర్పాటు చేశారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని మహిళ మృతి


మృతురాలు

తుని, న్యూస్‌టుడే: తుని రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో గెడ్డబీడు వద్ద విశాఖ వైపునకు వెళ్లే రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని మహిళ(45) మంగళవారం మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈమె ఎవరనేది తెలియరాలేదని, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచామన్నారు. వివరాలకు తుని జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

తుని పట్టణం, న్యూస్‌టుడే: తుని రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో గుల్లిపాడు- నర్సీపట్నం స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (35) ప్రమాదశాత్తూ జారిపడి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుడి మోచేతిపై గీతా జీకె అనే పచ్చబొట్టు ఆంగ్ల అక్షరాల్లో ఉందన్నారు. ఇవి తప్పా వేరే వివరాలు లభించలేదని, ఏరియా ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచామన్నారు.

చేపల వేటకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..!

● ఏలేరులో ప్రమాదవశాతు మత్స్యకారుడి మృతి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: చేపల వేట పూర్తి చేసుకుని తిరిగి వస్తాడనుకున్న భర్త కానరాని లోకాలకు వెళ్లిపోయాడని ఏలేశ్వరం నైలి పేటకి చెందిన గుదే కృష్ణవేణి అనే మహిళ విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ఎస్సై ఎన్.రామలింగేశ్వరరావు, స్థానికులు తెలిపిన వివరాలివీ.. రోజూ మాదిరే నైలి పేట వాసి గుదే శ్రీను (52) రబ్బరు ట్యూబ్ సాయంతో చేపల వేటకు వెళ్లాడు. నీటి ప్రవాహానికి రబ్బరు ట్యూబ్ అదుపు తప్పడంతో శ్రీను ప్రవాహంలో కొట్టుకుపోయి దుర్మరణం పాలయ్యారు. శ్రీనుకి భార్య కృష్ణవేణి, కుమారులు అప్పలరాజు, ప్రసాద్ ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న శ్రీను మృతి చెందడంతో ఆసరా పోయిందని భార్య రోదిస్తోంది. కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ప్రత్తిపాడు తరలించామని ఎస్సై తెలిపారు. శ్రీను కుటుంబాన్ని వార్డు కౌన్సిలర్ అలమండ చలమయ్య పరామర్శించారు.

చికిత్సపొందుతూ ఒకరు..

మసీదుసెంటర్(కాకినాడ): ప్రత్తిపాడుకి చెందిన ఎన్.భద్రరావు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందారు. కిర్లంపూడి పరిధిలో రోడ్డుప్రమాదానికి గురైన ఘటనలో తీవ్రగాయాలవ్వడంతో ఈనెల 12న జీజీహెచ్‌లో చేర్చారు. దీనిపై కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు.

పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : ఏలేశ్వరం తిమ్మరాజు చెరువు పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. దీనిపై ఏలేశ్వరం పోలీసులకు ఏ విధమైన ఫిర్యాదు అందలేదు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి శరీరంపై చొక్కా, నిక్కరు మాత్రమే ఉన్నాయి.

అనుమానాస్పద స్థితిలో..

తుని పట్టణం: ఈరంకివారి వీధిలో ఉన్న ఇంటి ఆవరణలో వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గమనించి స్థానికులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ప్రకారం కాట్రేనికోన మండలం నడవపల్లికి చెందిన అయితాబత్తుల రవికిరణ్(40)గా గుర్తించినట్లు సీఐ ఎం.గీతారామకృష్ణ తెలిపారు. అయితే సదరు వ్యక్తికి భార్యపిల్లలుండగా అలా ఊరూరా తిరుగుతుంటాడని తెలిసిందన్నారు. మృతుడు ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చాడు, భవనంలోకి ఎందుకు వెళ్లాడనేది దర్యాప్తు చేస్తున్నామన్నారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

గండేపల్లి,నే: నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై శివనాగబాబు తెలిపారు. యల్లమిల్లిలో మంగళవారం జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు నలుగురిని అదుపులోనికి తీసుకుని. వీరి నుంచి రూ.32,300 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాలువల నిర్వహణ అధ్వానం

పైకప్పు లేని వైనం

గండేపల్లి, న్యూస్‌టుడే: రోజూ వేల సంఖ్యలో వాహనాలు తిరిగే జాతీయ రహదారి (ఎన్‌హెచ్)పై సమస్యలు తెలిఆడుతున్నాయి. సమస్య కళ్ల ముందు కనిపిస్తున్నా, వాటి వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిసినా రహదారి నిర్వహణ అధికారులు, ఎన్‌హెచ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారిపై ప్రమాదకర కూడళ్ల వద్ద దీపాలు వెలగడం లేదని, ప్రమాదకర కూడళ్ల వద్ద ప్రత్యేక చర్యలు వంటివి చేపట్టాలని విన్నవించినా పట్టింపు లేని వైఖరి ప్రదర్శిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

మూతల్లేవు.. పట్టించుకుంటే ఒట్టు..

ఎన్‌హెచ్‌పై పడ్డ వాన నీరు పోయేందుకు రహదారికి ఇరువైపులా డ్రైన్లు నిర్మించారు. అయితే రహదారి వేసి సుమారు పదేళ్లు దాటుతుందని, ఇప్పటివరకు డ్రైనులో ఉన్న చెత్త, చెదారం తీసి శుభ్రపరిచిన దాఖలాలు లేవని గండేపల్లి గ్రామస్థులు పేర్కొనడం విస్మయపరుస్తుంది. ఇదిలా ఉండగా రహదారి డ్రైన్లపై వేసిన సిమెంట్ బల్లలు (మూతలు) కొన్నిచోట్ల లేకపోవడం, కొన్ని ప్రమాదాలతో బల్లలు శిథిలమవ్వడంతో రహదారి వెంబడి చాలచోట్ల డ్రైన్లు గోతులుగా ప్రమాదకరంగా మారాయి. నీలాద్రిరావుపేట, మల్లేపల్లి, గండేపల్లి, మురారి, తదితర గ్రామాల్లో గోతులతో రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనాలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రెండు రోజుల కిందట జడ్.రాగంపేట శివారు డ్రైనుపై సిమెంట్ బల్లలు లేకపోవడంతో కలప లోడు ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది. ఇప్పటికైనా రహదారి నిర్వహణాధికారులు శ్రద్ధ పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ సమస్యపై వివరణ కోరేందుకు 'న్యూస్‌టుడే' ప్రతినిధి సంబంధిత అధికారులను చరవాణిలో సంప్రదించేందుకు చేసిన పలు ప్రయత్నాలు వృథా అయ్యాయి.


మల్లేపల్లిలో ప్రమాదకరంగా రహదారి డ్రైన్లు


సిమెంట్ మూత లేక గుంతగా ఇలా..

గౌరీసంఘం అభివృద్ధికి సమష్టి కృషి


సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న సంఘ నాయకులు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా గౌరీ సేవాసంఘం అభివృద్ధి పరంగా ముందుకు తీసుకెళ్లేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామని సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధ ఈశ్వరరావు పేర్కొన్నారు. కిర్లంపూడి యల్లపువారి వీధిలోని గౌరీ సామాజిక భవనంలో ఉమ్మడి జిల్లా గౌరీ సేవాసంఘం సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఆడారి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై సంఘం నాయకులు చర్చించారు. అన్నవరం సత్యదేవుని సన్నిధిలో జిల్లా గౌరీసేవా సంఘం తరపున సత్రం గదులు నిర్మించాలని సమావేశంలో నిర్ణయించారు. సంఘంలో సభ్యులుగా చేరిన నాయకులకు, సభ్యులకు ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులు ఇస్తామని సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. సమావేశంలో జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు మద్దాల రమణ, మాజీ అధ్యక్షుడు పెంటకోట శ్రీరాములు, సంఘం ఆడిటర్ ఆడారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'నేర చట్టాల రద్దు కోసం పోరాటం'

జగ్గంపేట గ్రామీణం: భాజపా ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి మూడు నేర చట్టాలను ప్రజలపై బలవంతంగా రుద్దుతుందని ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యేసు అన్నారు. నేరచట్టాల రద్దుకై అక్టోబరు 18న విజయవాడలో రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలంటూ గోడపత్రికను ఆవిష్కరించారు. నాయకులు జె.సత్తిబాబు, బాలరాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పామాయిల్ మొక్కలు

శంఖవరం: పూర్తి రాయితీపై పామాయిల్ మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మండపం, గౌవరంపేట గ్రామాల్లో వ్యవసాయాధికారి గాంధీతో కలిసి రైతులకు సిబ్బందికి 'పొలం పిలుస్తోంది' మంగళవారం నిర్వహించారు. పత్తి, కంది సాగులో చీడపీడలను వివరించారు. రాయితీపై ఉన్న పరికరాలు, మొక్కలను రైతులు వినియోగించుకునేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

తొండంగి: కోదాడలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏడీఏ బుల్లిబాబు, ఏవో నరసింహం హాజరై రైతులకు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నియంత్రిక నుంచి ఎగసిపడిన మంటలు



జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రాజపూడిలో రావులమ్మ ఆలయ సమీపంలో ఉన్న 100 కెవి విద్యుత్తు నియంత్రిక నుంచి సోమవారం రాత్రి మంటలు ఎగసిపడ్డాయి. రాత్రి 10 గంటల సమయంలో ఈ నియంత్రిక నుంచి పెద్దఎత్తున మంటలు రావడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గ్రామకూడలి, చుట్టూ నివాస గృహాలు ఉండడంతో ప్రజలంతా భయంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. ఎల్ఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రదేశంలో గతంలో 40 కెవి నియంత్రిక ఉండేదని లోడు ఎక్కువగా ఉండడంతో 100 కెవి నియంత్రిక అమర్చినట్లు తెలిపారు. నియంత్రికలో ఆయిల్ లీకై సాంకేతికలోపంతో మంటలు వచ్చాయని ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. కాకినాడ నుంచి నియంత్రిక రావాల్సి ఉందని వచ్చిన వెంటనే అమర్చనున్నట్లు తెలిపారు.

మట్టి రోడ్లు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం


పైడికొండలో పాల్గొన్న నాయకులు, అధికారులు

తొండంగి: తుని నియోజకవర్గంలో మట్టి రోడ్లు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెదేపా నాయకుడు యనమల రాజేష్ అన్నారు. ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాల మేరకు కృష్ణాపురం, పైడికొండ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులు సుమారు రూ.25 లక్షలతో మంజూరైన సీసీ రహదారులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. దశల వారీగా నియోజకవర్గంలో మట్టి రోడ్లు లేకుండా చేస్తామన్నారు. నాయకులు కొయ్యా రామకేశవ, చొక్కా అప్పారావు, బంటుపల్లి అన్వేష్, కందా శ్రీధర్, ఎంపీడీవో బి.రాజేశ్వరరావు, ఏపీవో రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

తుని గ్రామీణం: పల్లెపండుగలో భాగంగా తుని నియోజకవర్గంలో ఎమ్మెల్యే దివ్య బుధవారం తుని, తొండంగి మండలాల్లో పర్యటిస్తున్నట్లు పార్టీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఉదయం 10 గంటలు తొండంగి మండలం శృంగవృక్షం, 11 గంటలకు చోడిపిల్లిపేట, 12 గంటలకు ఏవీ నగరం గ్రామాల్లోను, మధ్యాహ్నం 3 గంటలకు తుని మండలం తేటగుంట, 4 గంటలకు గవరపేట గ్రామాల్లో పర్యటించి సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

నాచు తివాచీలు.. ప్రజారోగ్యానికి ముప్పే..!

వేడుకలకు నేలపై, వేదికలపైన పచ్చని తివాచీ పరుస్తుంటారు. ఈ చిత్రంలోనిదీ అలా అనుకుంటే పొరపడినట్టే..! వర్షం నీరు వెళ్లే దారి లేక ఇళ్ల మధ్య నిలిచిన నీరు ఇలా నాచుకట్టింది. మురుగు పారే వ్యవస్థ లేకపోవడం, వాన నీరు పోయే ఏర్పాట్లు చేసుకోకపోవడం, సిమెంటు రోడ్లు నిర్మించాక డ్రైన్లు లేకపోవడంతో పలుచోట్ల ఈ పరిస్థితి ఉంది. ఖాళీ జాగాలను యజమానులు పట్టించుకోకపోవడమూ కారణమే. దీనివల్ల దోమలు, దుర్గంధంతో సమీప ఇళ్లలోని వారికి అవస్థలు తప్పడం లేదు. ప్రత్తిపాడు పంచాయతీ వెనుక లయన్స్ కమ్యూనిటీ హాలుకు వెళ్లే దారిలో ఇళ్ల మధ్య నాచు తివాచీలు కనిపిస్తున్నాయి. పోలీసుస్టేషన్ వెనుక వీధి నుంచి ఎస్సీ కాలనీకి వెళ్తున్నపుడూ ఇదే పరిస్థితి. సీహెచ్‌సీ ఎదురుగా ఉన్న కాలనీల్లోనూ ఇంతే. డ్రైన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడంతో పాటు ఖాళీ జాగాలను సవ్యంగా నిర్వహించేలా చర్యలు తీసుకోకపోతే ప్రజారోగ్యానికి పెనుముప్పే..!

\- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు


ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాలు సమీపంలో ఇళ్ల మధ్య నీరు నాచుకట్టి..